

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
సోమవారం 23 డిసెంబరు 2024




హార్బర్‌లో జట్టీకి చేరిన బోట్లు

నిజాంపట్నం హార్బర్‌లో.. 3వనెంబర్ ప్రమాదసూచిక

రేపల్లె,డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నిజాంపట్నం హార్బర్‌లో ఆదివారం 3వనెంబర్ ప్రమాదసూచిక కొనసాగుతోంది. వేటకు వెళ్ళిన బోట్లన్నీ తిరిగి రావాలని వైర్‌లెస్‌సెట్ల ద్వారా అధికారులు ఆదేశాలు జారీచేశారు. సముద్రంలో అలల ఉధృతి అల్లకల్లోలంగా ఉండటంతో వాతావరణంలో చలితో కూడిన ఈదురు గాలులు వీస్తుండడంతో మత్స్యకారులంతా హార్బర్‌కు చేరుకున్నారు. వేటకు వెళ్ళిన బోట్లన్నీ జట్టీలకు పరిమితమయ్యాయి.


అధ్వానంగా ఉన్న గురజాల ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం


ఆంధ్రజ్యోతి ఫోకస్

క్రీడల్

విద్యార్థులకు ఆటలు అవసరం.. శారీరక, మానసిక, దేహ దారుఢ్యానికి క్రీడలు దోహద పడతాయి.. అయితే జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సరైన క్రీడా మైదానాలు, వసతులు లేవు. ఆట స్థలాలు ఉన్న దగ్గర పీడీలు లేరు.. పీడీలు ఉన్న కళాశాలలకు మైదానాలు లేవు. ఉన్నా కొన్ని ప్రాంతాల్లో గుంతలు, పిచ్చిచెట్లతో నిండి ఉన్నాయి. ఇంటర్‌మీడియట్ జూనియర్, సీనియర్ విద్యార్థులకు ఆటలపై ఆసక్తి ఉన్నా.. వారిని ప్రోత్సహించే పరిస్థితి లేదు. మొత్తంమీద ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో క్రీడలపై ఆర్భాటంగా ప్రకటనలు చేశారే తప్ప అందుకు అనుగుణంగా పరిస్థితులను కల్పించడంలో నాటి పాలకులు విఫలమయ్యారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం క్రీడల్ని ప్రోత్సహించేందుకు చర్యలకు ఉపక్రమించింది. క్రీడా కోటా కింద మూడు శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో క్రీడా మైదానాల దుస్థితి, వసతులపై ఆంధ్రజ్యోతి బృందం ప్రత్యేక కథనం.

- ఆటలు లేని కళాశాలలు
- మైదానాలున్న దగ్గర అధ్వానం
- క్రీడా మైదానాల అభివృద్ధికి చెల్లుచీటి
- కొన్ని కాలేజీల్లో భర్తీ కాని పీడీ పోస్టులు
- క్రీడలకు దూరమవుతున్న ఇంటర్ విద్యార్థులు
- జూనియర్ కళాశాలల్లో క్రీడా సౌకర్యాలు కరువు
- గత ఐదేళ్లు ఒక్క పైసా ఇవ్వని వైసీపీ ప్రభుత్వం
- రేపల్లె కళాశాలలో రెండేళ్లుగా పూర్తికాని ఇండోర్ స్టేడియం
- 3 శాతం స్పోర్ట్స్ కోటా సరే.. సౌకర్యాలు కల్పించాలంటున్న విద్యార్థులు


వెనిగండ్ల జూనియర్ కళాశాల క్రీడా మైదానం


రేపల్లె : జూనియర్ కళాశాల ఇండోర్‌స్టేడియంలో పూర్తికాని పనులు

ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్, డిసెంబరు 22: ఉమ్మడి గుంటూరు జిల్లాలో 21, బాపట్ల జిల్లాలోని చీరాల పరిధిలో నాలుగు వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో దాదాపు 10 వేల మందికి పైగా విద్యార్థులున్నారు. అయితే చాలా కళాశాలల్లో క్రీడా మైదానాలే లేవు. అనేక జూనియర్ కళాశాలల్లో ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్లతోనే కాలం వెళ్లదీస్తున్నారు. కొన్ని కళాశాల్లో అయితే ఏళ్ల తరబడి పోస్టులు భర్తీకి నోచుకోవడంలేదు. గత ప్రభుత్వ హయాంలో క్రీడలపై ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమయ్యారు. గుంటూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సరైన ఆటస్థలం లేదంటే ఇక మండలాల్లోని పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పలు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జూనియర్ కళాశాలలను ప్రారంభించిన గత పాలకులు ఆ స్థాయిలో ఆట స్థలాలను ఏర్పాటు చేయలేదు. పీడీ పోస్టుల భర్తీ, ఆటల పరికరాలు, నిధులను మంజూరు చేయలేదు. అంతంతమాత్రం వసతులతోనే చాలా ప్రాంతాల్లో జూనియర్ కళాశాలలు నిర్వహిస్తున్నారు. ఇక క్రీడ మైదానాలు ఏర్పాటు చేయటం సాధ్యపడే పరిస్థితి కనిపించడంలేదు. కొన్ని ప్రాంతాల్లో ఆటస్థలాలు అధ్వానంగా మారాయి. ఆటల పరికరాలు విద్యార్థులకు సక్రమంగా అందుబాటులో ఉండటం లేదు దీంతో ఆసక్తి ఉన్న విద్యార్థులు కూడా ఆటల్లో వెనుకబడుతున్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న వారు ప్రైవేటుగా శిక్షణ తీసుకోవాలంటే ఖర్చుతో కూడుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి క్రీడలకు అనువైన వాతావరణం కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

- బాపట్ల సూర్యలంకరోడ్డులో సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను 1972లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు క్రీడా మైదానం లేదు. బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలోనే జూనియర్ కళాశాలతో పాటు 2014లో డిగ్రీ కళాశాల కూడా ఏర్పాటు చేశారు. దీంతో ఉన్న స్థలం మొత్తం భవన నిర్మాణాలకు సరిపోయింది. క్రీడలకు స్థలం లేకుండా పోయింది. ఆంజనేయ అగ్రహారం మున్సిపల్ పాఠశాల భవనంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను

(మిగతా 6వ పేజీలో)

ఆటలపై అలక్ష్యం..

గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్కసారి కూడా జూనియర్ కళాశాలల విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు ప్రభుత్వం నిర్వహించలేదు. ఆటలకు అవకాశమే ఇవ్వలేదు. అసలు ఆటల అంశాన్నే వైసీపీ ప్రభుత్వంలో అటు పాలకులు, ఇటు అధికారులు ఆలోచన చేయలేదు. క్రీడా పరికరాల కొనుగోళ్లకు కూడా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆటలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని నాటి పాలకులు ఆర్భాటం చేశారు.. తప్ప కనీసం ఆట స్థలాలను కూడా మెరుగు పరచలేదు. ఉమ్మడి గుంటూ రు జిల్లాలో జడ్పీ ఉన్నత పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా మార్చినా 294 ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయలేదు.


సత్తెనపల్లిలో రహదారిని తలపిస్తున్న జూనియర్ కాలేజీ క్రీడా మైదానం


బాపట్ల సూర్యలంకరోడ్డులో క్రీడాప్రాంగణం లేని సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

సంక్రాంతికి.. స్పెషల్ బస్సులు

- 150 సర్వీసుల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ కసరత్తు

గుంటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెద్ద పండుగ సంక్రాంతి పర్వదినానికి ఆర్టీసీ సమాయత్తమవుతోంది. మూడు రోజుల పండుగ పర్వదినాలకు సొంతూళ్ళకు ప్రజలు పెద్దఎత్తున రాకపోకలు సాగిస్తుంటారు. దూర ప్రాంతాల



నుంచి సొంతూళ్లకు వచ్చే వారి కోసం ప్రత్యేకంగా బస్సులను నడిపేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. అదనపు సర్వీసులు నడిపి తద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకునే దిశగా ఆర్టీసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 150 సర్వీసులను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు డీపీటీవో రవికాంత్ తెలిపారు. జిల్లాలోని గుంటూరు -1, 2 డిపోలతో పాటు తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోల నుంచి కూడా అదనపు బస్సులను ఏర్పాటు చేయనున్నారు. ముందుగా పండడుగకు గుంటూరు చేరుకునే ప్రయాణికులకు వీలుగా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి దూర ప్రాంతాల నుంచి కూడా బస్సు సర్వీసులను ఏర్పాటు చేయనున్నారు. వచ్చే నెల 9, 10వ తేదీల నుంచే హైదరాబాద్, చెన్నై, బెంగళూరు ప్రాంతాల నుంచి బస్సులను సిద్ధం చేస్తున్నట్లు డీపీటీవో తెలిపారు. పండుగ ముగిసిన తర్వాత 15, 16వ తేదీ రాత్రి నుంచే గుంటూరు నుంచి ఆయా ప్రాంతాలకు అదనపు బస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటితో పాటు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మరిని సర్వీసులను అందుబాటులో ఉంచుతామన్నారు.

ఇల్లు.. మాదంటే మాది

ఓ సివిల్ వివాదంలో టీడీపీ నేత వర్సెస్ డైమండ్‌బాబు

పోలీసుల అదుపులో డిప్యూటీ మేయర్

గుంటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయిబాబా రోడ్డు శాంతినగర్ రెండో లైన్‌లో ఓ ఇంటి వివాదం ఆదివారం రాత్రి ఉద్రిక్తతలకు దారితీసింది. తన సోదరి తరపున అనుచరులతో ఘటనా స్థలానికి వచ్చిన డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబుకు, పోలీసులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరగ్గా చివరకు ఆయన్ను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు.. శాంతినగర్‌లోని 306 చదరపు గజాల స్థలంలో రేకుల షెడ్డుకి సంబంధించి పావులూరి రామయ్య, పత్రి ఆనంద్‌మోహన్ మధ్య సివిల్ వివాదం నెలకొంది. ఆస్తి తమదంటే తమదని ఇరువర్గాలు కోర్టును ఆశ్రయించాయి. ఈ క్రమంలో పేరం వెంకటేశ్వర్ల నుంచి 2010లో టీడీపీ నేత యరమాల విజయ్‌కిరణ్ కొనుగోలు చేశారు. అయితే కోర్టులో 2014లో పత్రి ఆనందమోహన్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. విజయ్ కిరణ్ తప్పుడు డాక్యుమెంట్లతో స్థలం కొనుగోలు చేశారంటూ పావులూరి రామయ్య కుటుంబసభ్యులు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్లో 2015లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై విజయ్ కోర్టును ఆశ్రయించగా ఆ కేసును హైకోర్టు పది రోజుల క్రితం స్క్వాష్ చేసింది. అయితే ఆ స్థలంలో ఉన్న రేకుల షెడ్డులో డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు సోదరి వజ్రకుమారి, ఆమె కుమారుడు, కోడలు కుటుంబం అద్దెకు ఉంటుంది. అయితే డైమండ్‌బాబే ఆ స్థలాన్ని ఆక్రమించి తన అక్కను అందులో ఉంచారనేది ప్రత్యర్థుల ఆరోపణ. గత వైసీపీ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆ ఇంటిని కబ్జా చేశారని విజయకిరణ్ ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం కిరణ్ తన అనుచరులతో ఆ ఇంటికి వెళ్లి ఇల్లు ఖాళీ చేయాలని కోరగా అందుకు వారు నిరాకరించడంతో సామాగ్రిని బయటకు పడేసి ఇంటిని ఆక్రమించుకున్నారు. సీఐలు వీరేంద్రబాబు, నజీర్‌బేగ్ పెద్ద సంఖ్యలో పోలీసులు ఘటన స్థలానికి చేరుకోగా విజయకిరణ్ తన వద్ద ఉన్న డాక్యుమెంట్లను చూపారు. ఇంటిని ఆక్రమించేందుకు డైమండ్‌బాబు సోదరి యత్నించగా అడ్డుకున్నామని చెప్పారు. అక్కడకు చేరుకున్న డైమండ్‌బాబు తన వాదన వినిపిస్తూ అయితే తమ అక్క కుటుంబం అద్దెకు ఉంటుండగా విజయ్‌కిరణ్ బలవంతంగా సామాను బయటేసి ఆక్రమించుకున్నా రని ఆరోపించారు. ఇరువర్గాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో ఉండటంతో అక్కడి నుంచి వెళ్లిపోవాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదులు చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు చెప్పారు. పోలీసులకు, డైమండ్‌బాబుకు మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు ఆయన్ను బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. వీఆర్వోల సమక్షంలో విజయ్‌కిరణ్ అనుచరులను ఇంటి నుంచి బయటకు పంపి తాళాలు వేశారు. తిరిగి ఎవరూ ఇంట్లోకి వెళ్ళకుండా పోలీసులను ఏర్పాటు చేశారు. కాగా ఈ ఘటనకు సంబంధించి డైమండ్‌బాబు, విజయ్‌కిరణ్ లు వేరువేరుగా ఇచ్చిన ఫిర్యాదులపై పోలీసులు కేసులు నమోదు చేశారు.


డైమండ్ బాబును అదుపులోకి తీసుకుంటున్న పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు, పోలీసులు

పోలీస్ స్టేషన్‌కు వైసీపీ నేతలు

డైమండ్‌బాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిసిన వెంటనే పట్టాభిపురం స్టేషన్‌కు మేయర్ కావటి మనోహర్‌నాయుడు, వైసీపీ నేత అంబటి మురళి, నూరి ఫాతిమాతో పాటు పలువురు వైసీపీ కార్పొరేటర్‌లు చేరుకున్నారు. జరిగిన ఘటనపై సీఐతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

విగ్రహం తొలగింపులో ఉద్రిక్తత

- స్థానికులకు, పోలీసులకు మధ్య ఘర్షణ
- సీఐ, ఎక్స్‌కవేటర్‌పై స్థానికుల దాడి.. గాయాలు
- పోలీసుల లాఠీచార్జి.. స్థానికులకు స్వల్పగాయాలు

తెనాలి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓ వర్గానికి చెందిన విగ్రహం తొలగింపు ఉద్రిక్తతకు దారితీసింది. ఈ క్రమంలో సీఐ, ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌పై స్థానికులు దాడి చేయగా వారు గాయపడ్డారు. పోలీసుల లాఠీచార్జి చేయడంతో స్థానికులకు కూడా స్వల్పంగా గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు.. తెనాలి పట్టణ పరిధిలోని చంద్రబాబునాయుడుకాలనీలోని మున్సిపల్ ఖాళీ స్థలంలో రాత్రికి రాత్రి ఒక దిమ్మె కట్టి దానిపై ఒక వర్గం వారు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలిసి మున్సిపల్ అధికారులు ఆ విగ్రహాన్ని తొలగించాలని స్థానికులు కోరారు. అయితే వారు అంగీకరించకపోవడంతో అధికారులు తొలగించే ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారు. దీంతో మున్సిపల్ అధికారులు పోలీసు రక్షణ కోరగా త్రీ టౌన్ సీఐ రమేష్, తమ సిబ్బందితో వచ్చి స్థానికులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. ఎంత చెప్పినా వారు వినకపోవడంతో పోలీసులు ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి విగ్రహం తొలగించేందుకు సిద్ధమయ్యారు. దీంతో స్థానికులు, మహిళలు ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకోగా పోలీసులు వారిని పక్కకు పంపేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ క్రమంలో పోలీసులకు, స్థానికుల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తతకు దారితీసింది. స్థానికులు ఎక్స్‌కవేటర్‌పైకి రాళ్లు విసరడంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అతి కష్టంమీద ఎక్స్‌కవేటర్‌ను విగ్రహం ఉన్న ప్రదేశానికి తీసుకెళ్లగా మహిళలు అడ్డుకుని విగ్రహాన్ని తొలగించడానికి వీలులేదంటూ భీష్మించారు. పోలీసులు మరోసారి జోక్యం చేసుకుని వారిని నెట్టేస్తున్న తరుణంలో ఓ వ్యక్తి సీఐ రమేష్ మెడ పట్టుకుని పిసికేస్తుండగా, మహిళలు కొందరు గోళ్లతో గీరేయడం, కొట్టటం వంటి చర్యలకు దిగారు. గమనించిన పోలీసులు వారిపై లాఠీచార్జి చేశారు. అందరినీ చెదరగొట్టి విగ్రహాన్ని తొలగించేందుకు ఉపక్రమించటంతో స్థానికుల్లో కొందరు వచ్చి మా దేవత విగ్రహాన్ని తొలగిస్తే పక్కనే వేపచెట్టు కిందున్న విగ్రహాలను కూడా తొలగించాలని పట్టుబట్టారు. అన్నీ తొలగిస్తామని చెప్పిన పోలీసులు తొలుత విగ్రహాన్ని తొలగించేశారు. తర్వాత అకమ్మ చెట్టు దగ్గర విగ్రహాలు తొలగించేందుకు వెళితే, వాటిని ఏర్పాటు చేసుకున్న వారూ అధికారులను ప్రాథేయపడ్డారు. అవి ఈ మధ్యకాలంలో ఏర్పాటు చేసినవి కాదని, కాలనీ ఏర్పడిన తొలినాళ్లలోనే ఏర్పాటు చేసుకున్నామని చెప్పగా మున్సిపల్ స్థలంలో ఏవీ ఉండనివ్వొద్దని అధికారులు చెప్పారని సీఐ వారికి నచ్చచెప్పి, కట్టడాలను, ఫొటోలను తొలగించారు. అదే సమయంలో స్థానికులు మళ్లీ పోలీసుల దగ్గరకు వచ్చి లాఠీచార్జిలో తమకు తగిలిన దెబ్బలు చూపుతూ ఆందోళనకు దిగారు. తమపైనా దాడికి దిగారని, సిబ్బందికీ, ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌కూ దెబ్బలు తగిలాయని మున్సిపల్ సిబ్బంది చెప్పడం.. అదే సమయంలో మళ్లీ వాదనలు పెరుగుతున్న తరుణంలో పోలీసులు సర్ది చెప్పి పంపేశారు. దాడికి పాల్పడిన కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమకు అన్యాయం జరిగిందంటూ, తమపై పోలీసులు దౌర్జన్యం చేశారని కాలనీవాసులు కొందరు డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసునమోదు చేస్తామని, ప్రభుత్వ స్థలం ఆక్రమించుకోవాలని చూడటం, విధినిర్వహణలో ఉన్న సిబ్బందిపై దాడికి దిగడం సరైనది కాదని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రమేష్ చెప్పారు.


చంద్రబాబునాయుడు కాలనీలో మున్సిపల్ స్థలంలో రాత్రికి రాత్రి ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగిస్తున్న మున్సిపల్, పోలీస్ సిబ్బంది

వీఆర్‌లో ఉన్న సీఐ సస్పెన్షన్

హెడ్ కానిస్టేబుల్‌పై లైంగిక వేధింపులతో సస్పెన్షన్

6

12న కృష్ణానది క్రాస్ ఈతల పోటీలు

- దుర్గా ఘాట్ నుంచి సీతానగరం బ్యారేజి వరకు..

6


ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ ఐక్యత చాటుతున్న కేంద్రమంత్రి పెమ్మసాని, ఎమ్మెల్సీ అనురాధ, ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, నక్కా ఆనందబాబు, బ్రహ్మారెడ్డి, నసీర్ అహ్మద్, రామాంజనేయులు, మాధవి తదితరులు

మండలిలో ఆలపాటి సేవలు అవసరం

- ఆయన్ని గెలిపించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలి
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

బధిరరహిత స్వర్ణాంధ్ర సాధనకు కృషి


శిబిరంలో భాష్యం రామకృష్ణ, డాక్టర్ సుబ్బారాయుడు

గుంటూరు మెడికల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమైన బధిరరహిత స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు తమ వంతు కృషి చేస్తున్నట్లు ఏబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ తెలిపారు. ఆదివారం గుంటూరువారితోట మూడో లైన్‌లోని రాధికా రాయుడు హాస్పిటల్‌లో ఏబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినికిడిలోపం గల పిల్లలకు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వినికిడిలోపం గల చిన్నారులకు ఉచితంగా కాక్లియార్ ఆపరేషన్లు చేయించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహిస్తామని భాష్యం రామకృష్ణ తెలిపారు. ఇఎన్‌టీ సర్జన్ డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున ఉచితంగా కాక్లియార్ సర్జరీలు జరుగుతున్నట్లు తెలిపారు. దీనిపై తల్లిదండ్రులకు సరైన అవగాహన లేక వయసు పరిమితి దాటిన తర్వాత పిల్లలను తీసుకురావడం వల్ల ఉచిత ఆపరేషన్లు చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన శిబిరంలో 100 మంది పిల్లలకు వినికిడి లోపం పరీక్షలు నిర్వహించారు. వీరిలో అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని డాక్టర్ పాములపాటి రాధికా రాణి తెలిపారు. నెఫ్రాలజిస్ట్ డాక్టర్ గొంది శివరామకృష్ణ, దంత వైద్యనిపుణులు సాయిశంకర్, డాక్టర్ దినేష్, ఆడియాలజిస్ట్ టి.నరేంద్ర పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తాం


చెరుకూరి సుభాష్ చంద్రబోస్‌కి సత్కారం

పెదకాకాని, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు చదువు నిమిత్తం ఆర్థిక సాయం అందజేస్తామని చెరుకూరి సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ఆదివారం పెదకాకానిలో చెరుకూరి వారి 5వ ఆత్మీయ కలయిక ఘనంగా నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షులు చెరుకూరు సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ అనంతపురంకు చెందిన ఇంటర్ విద్యార్థికి రూ.65 వేలు చదువు నిమిత్తం సహాయం అందించామన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలని ఆయన సూచించారు. విష్ణు కెమికల్స్ అధినేత చెరుకూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ చదువుకున్న వారికి తమ సంస్థలో ఉద్యోగ కల్పన చేస్తామని ప్రకటించారు. 500 మందికిపైగా చెరుకూరి వంశస్తులు, శ్రీబిల్డర్స్ అధినేత సతీష్ బాబు, చెరుకూరి లెనిన్, ఆర్చరీ అకాడమీ అధినేత సత్యనారాయణ, సీతారామయ్య, జగదీష్ చంద్రశేఖర్ హాజరయ్యారు.

12న కృష్ణానది క్రాస్ ఈతల పోటీలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు

తాడేపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే సందర్భంగా ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణానది క్రాస్ ఈత పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి మండపాటి లక్ష్మీనరసరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ దుర్గా ఘాట్ నుంచి సీతానగరం ప్రకాశం బ్యారేజి వద్ద ఉన్న లోటస్ ఫుడ్ సిటీ వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. 11-18 సంవత్సరాల వరకు మొదటి క్యాటగిరీ, 19-30 వరకు రెండో క్యాటగిరీ, 31-40 వరకు మూడో క్యాటగిరీ, 41-50 వరకు నాలుగో క్యాటగిరీ, 51-60 వరకు ఐదో క్యాటగిరీలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ప్రతి క్యాటగిరీలో మొదటి మూడు బహుమతులతోపాటు విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. జనవరి 10లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం పోస్టర్‌ను మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, వెలగపూడి వెంకటేశ్వరరావు, దాసరి యుగంధర్, కర్రి సాంబయ్య, యర్రంశెట్టి శ్రీనివాసరావు తదితరులు ఆవిష్కరించారు.

మండలిలో ఆలపాటి సేవలు అవసరం

- ఆయన్ని గెలిపించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలి
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్, వేదికపై ప్రజా ప్రతినిధులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆలపాటిని గెలిపిస్తే ప్రభుత్వానికి, ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగుల మధ్య వారధిగా పనిచేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు ఏటుకూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్‌లో ఆదివారం, గుంటూరు-కృష్ణా ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు అధ్యక్షత వహించారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుతోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు హాజరైయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రయోజనాల రీత్యా కూటమి ఒప్పందానికి అంగీకరించి రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా తెనాలిలో 55 వేల మెజారిటీ తీసుకువచ్చేలా ఆలపాటి రాజా కష్టపడ్డారని గుర్తుచేశారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయనకు తిరుగులేని మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు, నాయకులు కష్టపడాలని సూచించారు. ఉపాధ్యాయులు, పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ రానున్న రోజుల్లో శాసన మండలి క్రియాశీలకంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఆలపాటిని గెలిపించి శాసనమండలికి పంపాలని కోరారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఐక్యంగా పోటీచేస్తే వచ్చే ఫలితాలు శాసనసభ ఎన్నికలు రుజువు చేశాయని అన్నారు. ఓట్లు చీలకుండా, నాయకులను సమన్వయం చేసుకుని ఆలపాటి గెలుపునకు కృషి చేయాలన్నారు. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఓటమిని ముందుగానే జగన్ ఊహించి పోటీ నుంచి తప్పుకున్నాడని ఎద్దేవా చేశారు. ఇదే కొనసాగితే 2029లో జరిగే శాసనసభ ఎన్నికల ముందే జగన్ తప్పుకుంటాడని విమర్శించారు. దాదాపు ఆలపాటి గెలుపు నిర్ణయమైందని, కాకపోతే అత్యధిక మెజార్టీ కోసం కృషి చేయాలన్నారు. అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు మాట్లాడుతూ అభ్యర్థిగా ఎంపిక చేసిన చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, పురందేశ్వరిలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ సమస్య పరిష్కారానికై కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, నసీర్ అహమద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, తెనాలి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్సీలు పంచుమర్తి అనురాధ, కంచర్ల శ్రీకాంత్, చిరంజీవిరావు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు డేగల ప్రభాకర్, పిల్లి మాణిక్యరావు, అబద్దయ్య, మంజులా రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు రాయపాటి శ్రీనివాస్, ఏఎస్ రామకృష్ణ, కూటమి నాయకులు గాదె వెంకటేశ్వరరావు, మాగంటి సుధాకర్, ఉపాధ్యాయుల సంఘ నాయకులు తదితరులు పాల్గొని ప్రసంగించారు. కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాలలకు చెందిన పట్టభద్రులు పాల్గొన్నారు.

(5వ పేజీ తరువాయి)

నిర్వహిస్తున్నా పీడీ పోస్టు లేదు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో 160 మంది విద్యార్థులకు పీడీ ఉన్నా ఆట స్థలం లేదు. ప్రాంగణంలో టైల్స్ వేయడంతో దానిపై ఇసుక పోసి మొక్కుబడిగా ఆటలు ఆడిస్తున్నారు.

- చీరాల నియోజకవర్గ పరిధిలో నాలుగు ప్రభుత్వ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో వందల సంఖ్యలో విద్యార్థులు ఉన్నారు. అయితే ఆయా కళాశాలల్లో ఆటస్థలాల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇక్కడ విద్యార్థులకు ఆటలకు అవకాశం లేకుండా పోయింది.
- వేమూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 1979-80లో ప్రారంభించగా అప్పటి నుంచి పీడీ పోస్టు లేదు. దీంతో విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి ఉన్నా ఆటలు ఆడించే వారు లేకపోవడంతో వారు నిరాశకు గురవుతున్నారు. పీడీ పోస్టు లేకపోవడంతో క్రీడలకు చెందిన ఎలాంటి వస్తువులు కూడా ప్రభుత్వం నుంచి మంజూరు కావడంలేదు.
- రేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏడేళ్ల క్రితం పీడీ ఉద్యోగ విరమణ చేయగా అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. కళాశాలలో పెద్ద క్రీడా మైదానం ఉన్నా 150 మంది విద్యార్థులకు క్రీడలు నేర్పించే పరిస్థితి లేదు. కనీసం ఆటలు ఆడుకునే పరికరాలు కూడా లేవు. కళాశాల ప్రాంగణంలో 2022లో అప్పటి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణారావు ఇండోర్ స్టేడియానికి శంకుస్థాపన చేయగా ఇప్పటికీ నిర్మాణం పూర్తి కాలేదు. బేస్‌మెంట్, చుట్టూ ఐరన్ పిల్లర్స్ పైన కప్పు వేశారే తప్ప కింద భాగంలో కాంక్రీట్ వేయలేదు. ప్రహరీ నిర్మాణంతో పాటు విద్యుత్, తాగునీటి పైప్‌లైన్లు వెయ్యాల్సి ఉంది. కాంట్రాక్టర్‌కు బకాయిలు చెల్లించకపోవడంతో ఇండోర్ స్టేడియం పనులను నిలిపివేశారు.
- మాచర్లలో ఎస్‌కేబీఆర్ జూనియర్ కళాశాలకు క్రీడా మైదానం ఉండగా ఆట పరికరాలు, పీడీ లేరు. దుర్గిలోని జూనియర్ కళాశాలకు క్రీడా మైదానం లేదు. పీడీ లేరు.

క్రీడల్

- వినుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పదేళ్ల నుంచి పీడీ పోస్టు భర్తీకి నోచుకోలేదు. విశాలమైన గ్రౌండ్ ఉంది. దీంతో కళాశాలలోని 450 మంది విద్యార్థులు క్రీడలపై మక్కువ చూపలేక పోతున్నారు. నూజెండ్ల మండలం ఉప్పలపాడులోని గురుకుల పాఠశాలలో క్రీడా మైదానం సక్రమంగా లేదు. ఒకే ఒక పీఈటీ ఉన్నారు. దీంతో విద్యార్థులకు క్రీడా అవకాశాలు కోల్పోతున్నారు. మోడల్ స్కూల్‌లో కాంట్రాక్ట్‌పై పీఈటీ ఉన్నా ఆట స్థలాలు లేవు.
- సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా మైదానం అధ్వానంగా ఉంది. పిచ్చిచెట్లు, గుంతలతో నిండి ఉన్న మైదానంలో విద్యార్థులు ఆటలాడేందుకు అవకాశం లేదు. పీడీ పోస్టు ఉన్నా అవసరమైన క్రీడా పరికరాలు లేవు. మైదానం అభివృద్ధికి సహకరించాలని ప్రిన్సిపాల్, పీడీలు ఇటీవల ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దృష్టికి కూడా తీసుకువెళ్లారు.
- పిడుగురాళ్ల, గురజాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో క్రీడా మైదానాలు అధ్వానంగా ఉన్నాయి. కళాశాలలకు ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు భర్తీకి నోచుకోవడంలేదు. దాచేపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆటస్థలం లేదు. పీడీ పోస్టు ఖాళీగా ఉంది. క్రీడా పరికరాలు ఉన్నా వినియోగించే వీలులేక బీరువాలో ఉన్నాయి.
- పొన్నూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా సౌకర్యాలతో పాటు పీడీ పోస్టు ఏళ్లుగా భర్తీ కాలేదు. వెల్లలూరులోని జూనియర్ కళాశాలలో క్రీడలకు అవసరమైన ప్రాంగణం లేదు. పీడీ పోస్టు కూడా భర్తీ చేయలేదు. కళాశాల విద్యార్థులకు అదే ప్రాంగణంలోని హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయురాలు క్రీడల శిక్షణ ఇస్తున్నారు. పెదకాకాని మండలం వెనిగండ్లలోని జూనియర్ కళాశాలకు ఫిజికల్ డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది.

సీఐపై సస్పెన్షన్ వేటు

గుంటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళా హెడ్ కానిస్టేబుల్ పట్ల అసభ్యంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు గురిచేసిన ఘటనలో సీఐ జగన్మోహన్‌రావుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు ఆదివారం రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం వద్ద భవాని దీక్ష విరమణను పురస్కరించుకొని గుంటూరు రేంజ్ నుంచి పలువురు పోలీస్ అధికారులు, సిబ్బందిని బందోబస్తు నిమిత్తం నియమించారు. దీనిలో భాగంగా రేంజి వీఆర్‌లో ఉన్న సీఐ జగన్మోహన్‌రావును కూడా బందోబస్తుకు నియమించారు. అక్కడ బందోబస్తు విధుల్లో ఉన్న తోటి మహిళా హెడ్ కానిస్టేబుల్ పట్ల సీఐ జగన్మోహనరావు అసభ్యంగా ప్రవర్తించాడు. అంతేగాక ఆమెను లైంగిక వేధింపులకు గురి చేశాడు. ఆమె సెల్‌ఫోన్‌కు అసభ్యకర సందేశాలు పంపాడు. లైంగిక వేధింపులు శృతిమించడంతో బాధిత మహిళా హెడ్ కానిస్టేబుల్ పోలీస్ ఉన్నతాధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. పోలీస్ అధికారుల ప్రాథమిక విచారణలో సీఐ లైంగిక వేధింపుల వ్యవహారం వాస్తవమేనని తేలింది. దీంతో ఆయన్ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ రేంజ్ ఐజీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

గార్డెన్‌లో గంజాయి మొక్క



మాచర్ల టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి మొక్కను గుట్టుచప్పుడు కాకుండా అటవీ ప్రాంతాల్లో పెంచడం వింటుంటాం. కానీ పట్టణ నడిబొడ్డున అదీ కూడా పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో గంజాయి మొక్క పెరగడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పట్టణంలోని ఆర్‌అండ్‌బి ఆఫీస్ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్ గార్డెన్‌లో గంజాయి మొక్క పెరుగుతోంది. ఇది ప్రస్తుతం నాలుగు అడుగుల దాకా పెరిగింది. ఇది గుర్తించిన కొందరు విద్యార్థులు గంజాయి మొక్క ఆకులను తెంచుకొని వెళ్తున్నారు. ఈ విషయం కాస్తా బయటకు పొక్కి పోలీసుల దాకా చేరింది. దీంతో పట్టణ పోలీసులు ఆదివారం ఆ గంజాయి మొక్కను తొలగించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

ఉరకలెత్తిన ఉత్సాహం


యువజనోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు

పెదకాకాని, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయ స్థాయి యువజనోత్సవం వివా-వీవీఐటీ 2024-25 వేడుకలు ఘనంగా ఆదివారం ముగిశాయి. రెండో రోజు యువజనోత్సవంలో భాగంగా నిర్వహించిన సాంకేతిక, సాంస్కృతిక క్రీడలు యువతను ఆకట్టుకున్నాయి. విద్యార్థుల కేరింతలతో ప్రాంగణం మార్మోగింది. ఆట, పాటలతో విద్యార్థులు ఉర్రూతలూగించారు. సాహితీ ప్రహేళిక, ఆధునిక అష్టావధానం, జానపద, శాస్త్రీయ నృత్యం, సంగీతం, సాంస్కృతిక అంశాలతోపాటుగా కోడ్ రివైంట్, ట్రెజర్ హంట్, మ్యాట్రిక్ మిస్టరీ, క్యాడ్ కాంటెస్ట్, బ్రెయిన్లీ బవుంట్ వంటి సాంకేతిక అంశాలలో పోటీలు నిర్వహించారు. బాస్కెట్ బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఖోఖో క్రీడలు ఉత్కంఠగా సాగాయి. విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాషామాబ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముగింపు వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సెక్రటరీ, కరస్పాండెంట్ వై.సుజిత్ కుమార్, నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వర్లు, వీవీఐటీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ పాల్గొన్నారు. యువజనోత్సవం పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వీవీఐటీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ యువజనోత్సవంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరిబాబు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.85
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96,104,115
చికెన్ విత్ స్కిన్	184.00
చికెన్ స్కిన్ లెస్	194.00

103 మంది శానిటేషన్ వర్కర్స్ డిప్యూటేషన్ విధులు రద్దు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబర్ 22(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని ఆప్కాస్‌లో జీతాలు తీసుకుంటూ డిప్యూటేషన్‌పై అనేక ప్రాంతాల్లో పని చేస్తున్న 103 మంది పారిశుధ్య కార్మికుల విధులను రద్దు చేస్తూ నగర పాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ శోభారాణి ఉత్తర్వులు జారీ చేశారు. నగరపాలక సంస్థ శానిటేషన్ విభా గంలో పని చేయాల్సి ఉండగా డిప్యూటేషన్ పై మేయర్, డిప్యూటీ మేయర్‌లు, హైకోర్టు జడ్జిల వద్ద, అన్నమయ్య జిల్లా కలెక్టర్ వద్ద ఇలా అనేకచోట్ల వీళ్లందరూ పనిచేస్తున్నారు. వీరందరినీ తిరిగి శానిటేషన్ పనులకు రప్పించేందుకు డిప్యూ టేషన్ ఉత్తర్వులను రద్దు చేశారు. ఆయా శానిటేషన్ డివిజన్ వారీగా వాకికి విధులు కేటాయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో స్కూల్ కాంప్లెక్స్‌ల వివరాలు

గుంటూరు(విద్య),డిసెంబరు 22(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కొత్తగా గుంటూరు జిల్లాలో ఏర్పాటు చేయనున్న స్కూల్ కాంప్లెక్స్ సముదాయాల వివరాలు, జాబితాలను జిల్లాలోని అందరూ ఉప విద్యా శాఖాధికారులు, మండల విద్యాశాఖధికారులు తమ కార్యాలయాలలో ప్రదర్శించాలని డీఈవో సీవీ రేణుక ఆదేశించారు. వీటిపై ఏవైనా అభ్యంతరాలు, సలహాలు ఉంటే ఈ నెల 27లోపు జిల్లా విద్యాశాఖధికారి, మండల విద్యాశాఖాధికారుల కార్యాలయాలలో నేరుగా అందించాలని లేదా ఈ నెల 23 నుంచి విద్యా శాఖ వెబ్‌సైట్ https://cse.ap.gov.in ద్వారా తెలియజేయాలని సూచించారు.



మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు

'పీడీఎఫ్ అభ్యర్థినే ఎమ్మెల్సీగా గెలిపించాలి'

గుంటూరు(విద్య),డిసెంబరు 22(ఆంధ్ర జ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థినే ఎమ్మెల్సీగా గెలిపించాలని కేఎస్ లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పీడీఎఫ్ ఎమ్మెల్సీలు 2001 నుంచి శాసనమండలిలో కృషి చేస్తున్నారని తెలిపారు. రాజ్యాంగ లక్ష్యాలకు కట్టుబడి పనిచేస్తున్నారని,ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, మహిళలు, అంగన్వాడీల సమస్యలపై పోరాటాలు చేస్తున్నారని అన్నారు. విద్యారంగ పరిరక్షణ కోసం పనిచేస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కూడా పీడీఎఫ్ అభ్యర్థిగా ఉన్న తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో న్యాయవాది నర్రా శ్రీనివాసరావు, జీ వెంకటరావు, వీవీకే సురేష్ పాల్గొన్నారు.



సినీ గీతాలను ఆలపిస్తున్న గాయనీమణులు

అలరించిన సినీ సౌరభాలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 22(ఆంధ్ర జ్యోతి): మహతి స్వర సుధ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సినీ సౌరభాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత కన్నా విద్యా సంస్థల అధినేత కన్నా మాస్టారు ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరు నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలనాటి మేటి చిత్రాల్లోని పలు మధుర గీతాలను గాయనీగాయకులు ఆలపించారు. కీబోర్డుపై కే రవిబాబు, తబలాపై ఎస్ వెంకట్, ప్యాడ్స్ పై ఎస్‌బీ సైదులు వాయిద్య సహకార అందించారు. వ్యాఖ్యాతగా బీ కృష్ణప్రసాద్ వ్యవహరించగా, కె.మదన్ మోహన్‌రావు పర్యవేక్షించారు.



పవళింపు సేవ నిర్వహిస్తున్న నిర్వాహకులు

ముగిసిన శ్రీరామ కోటి మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 22(ఆంధ్ర జ్యోతి): స్థానిక సంపత్‌నగర్‌లోని శ్రీ శృంగేరి పీఠ పాలిత శ్రీరామనామ క్షేత్రంలో 98వ శ్రీరామ కోటి మహోత్సవాలు ఆది వారం వైభవంగా ముగిశాయి. మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకరణ నిర్వహించారు. సాయంత్రం అద్దాల మందిరంలో స్వామి పవళింపు సేవ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో జరిగింది. ప్రముఖ గాయని శారదా బృందం నిర్వహించిన భక్తి సంగీత లహరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు రాగం వెంకట లీలా సుందరి, బెల్లంకొండ మస్తాన్‌రావు పర్యవేక్షించారు.



కీర్తనలను ఆలపిస్తున్న ఎన్ సవిత

శాస్త్రీయ సంగీత కచేరి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 22(ఆంధ్ర జ్యోతి): స్థానిక లక్ష్మీపురంలోని త్యాగరాజస్వామి కళావేదికపై ఆదివారం త్యాగరాజ స్వామి సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. ప్రవాసాంధ్రురాలు, ప్రముఖ సంగీత విద్వాంసురాలు ఎన్. సవిత కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. వయోలిన్‌పై ఎన్. శాలిని, మృదంగంపై నేతి రామకృష్ణ వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమాన్ని విశ్వేశ్వరరావు, కృష్ణకిషోర్, గిరిజాశంకర్ పర్యవేక్షించారు.

ఆక్రమణలు తొలగించాలి

- చిన్నేరుకుంట, మణిపురంబ్రిడ్జి ఫ్లైఓవర్ ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్
- నోటీసుల జారీ చేయాలని ఆదేశాలు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): చిన్నేరుకుంట, మణిపురం ఫ్లై ఓవర్‌కు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించాలని, అవసరమైతే పోలీస్ సహకారం తీసుకోవాలని పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక ఆర్టీసీ కాలనీ రోడ్డులోని చిన్నేరు కుంట, మణిపురం ఫ్లైఓవర్ ప్రాంతాల్లో ఆదివారం కమిష నర్ పర్యటించారు. తొలుత చిన్నేరుకుంటని పరిశీలించిన కమిషనర్, గతంలో చేపట్టిన పనులు, పెండింగ్ పనుల వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నేరుకుంట చుట్టుపక్కల ఆక్రమణల తొలగింపునకు సోమవారం నోటీసులు జారీ చేయాలని సిటీప్లానర్‌ని ఆదేశించారు. కుంట చుట్టూ వాకింగ్ ట్రాక్ వంటి అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఇంజినీరింగ్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మణిపురం ఫ్లైఓవర్‌కి ఇరువైపులా ఆక్రమణలను పరిశీలించారు. ఈ పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్‌కుమార్, ఏసీపీ మల్లికార్జున, టీపీఎస్ లక్ష్మణస్వామి, డీఈఈ నాగభూషణం, ఏఈ సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



నందివెలుగు రోడ్డులోని చిన్నేరు కుంట మ్యాప్‌ను పరిశీలిస్తున్న జీఎంసీ కమిషనర్ పీ శ్రీనివాసులు



విజేతలకు కప్ అందజేస్తున్న డాక్టర్ సూర్యనారాయణ

వర్సిటీ ఖోఖో జట్టుకు 15 మంది ఎంపిక

గుంటూరు(విద్య), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): టీజేపీఎస్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న అంతర కళాశాలల ఖోఖో (పురుషుల) పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో విక్టరి డిగ్రీ (నరసరావుపేట) కళాశాల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. అనంతరం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ టీం ఎంపికలు జరిగాయి. యూనివర్సిటీ ఖోఖో జట్టులో విక్టరి డిగ్రీ కళాశాల నుంచి ఐదుగురు, డీసీఆర్ఎం కళాశాల నుంచి నలుగురు, కృష్ణవేణి డిగ్రీ కళాశాల నుంచి ఇద్దరు, వాగ్దేవి డిగ్రీ కళాశాల నుంచి ఒకరు, యూనివర్సిటీ వ్యాయామ కళాశాల నుంచి ఒకరు, జేకేసీ కళాశాల నుంచి ఒకరు, ధనలక్ష్మి వ్యాయామ కళాశాల నుంచి ఒకరు, మొత్తం 15 మందిని ఎంపిక చేశారు.



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కోచ్‌లు

అంతరజిల్లాల ఏరో స్కేట్‌బాల్ జట్ల ఎంపికలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీవో కార్యాలయం రోడ్డులోని ఏరో స్కేటింగ్ రింక్‌లో ఆదివారం అంతరజిల్లాల ఏరో స్కేట్‌బాల్ జట్ల ఎంపికలు జరిగాయి. ఏరో స్కేట్ బాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికల్లో పలు జిల్లాలకు చెందిన 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే ఏడాది జనవరి 11న షిర్డీలో జరిగే జాతీయ పోటీలలో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ ఖాజా తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీహరి, నాగేశ్వరరావు, రాకేష్, శరత్, కోచ్‌లు పాల్గొన్నారు.

'కామ్రేడ్ కాళిదాసు' అభినందన సంచిక ఆవిష్కరణ

గుంటూరు(తూర్పు), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీవోస్ కల్యాణ మండపంలో సంస్కృతి సంగీత సాహిత్య నృత్య నాటక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 'కామ్రేడ్ కాళిదాసు' అభినందన సంచిక ఆవిష్కరణ సభ జరిగింది. సభకు సంస్కృతి వ్యవస్థాపకుడు సర్రాజు బాలచందర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రంగస్థలం సినీ నటుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) ఈ సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాళిదాసు దంపతులను ఘనంగా సత్కరించారు. రంగస్థల, సినీ నటుడు ముత్తవరపు సురేష, ప్రజా కవి కొత్తూరు దేవేంద్ర, ఆంధ్ర ప్రజా నాట్యమండలి పూర్వ కార్యదర్శి కేశాంతారావు, ప్రజా గాయకుడు పీవీ రమణ పాల్గొన్నారు.



కాళిదాసు అభినందన సంచికను ఆవిష్కరిస్తున్న సర్రాజు బాలచందర్, సాహితీవేత్తలు

సీపీఆర్‌లో శిక్షణ తప్పనిసరి

గుంటూరు మెడికల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్డియాక్ అరెస్ట్ జరిగిన రోగుల ప్రాణాలను కాపాడేందుకు అత్యవసరంగా చేసే కార్డియాక్ పల్మనరీ రీసక్సిటేషన్ (సీపీఆర్)లో నర్సులు, పారా మెడికల్ సిబ్బంది తప్పనిసరిగా శిక్షణ పొందాలని విశ్రాంత లెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ వై అశోక్ తెలిపారు. స్థానిక కొత్తపేటలోని కారుమూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఐసీయూలో విధులు నిర్వహించే నర్సులు, పారా మెడికల్ సిబ్బందికి బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎస్ఎల్)పై ఆదివారం నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయండి

గుంటూరు(విద్య),డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆధ్వర్యంలో జనవరి 5,6,7,8 తేదీలలో కాకినాడలో జరిగే స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు కుసుమకుమారి పిలుపు నిచ్చారు. స్థానిక బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుసుమకుమారి మాట్లాడుతూ 5,6 తేదీలు రెండు రోజులు ఓపెన్ సెషన్ జరుగుతుందని, ఈ రెండు రోజులు ఉపాధ్యాయులు ఎవరైనా పాల్గొనవచ్చని చెప్పారు. 7, 8 తేదీల్లో డెలిగేట్లకు మాత్రమే పాల్గొనే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం హను మంతరావు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యూ రాజశేఖర్‌రావు, ఎం కళాధర్ , జిల్లా సహా ధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాగమణి జిల్లా కోశాధికారి దౌలా జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, సాంబశివరావు, వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, షకీలా బేగం, రంగారావు, ప్రసాదు, కేదా ర్నాథ్, కామాక్షి, ఆడిట్ కమిటీ అడవి శ్రీనివాసరావు, కోటిరెడ్డి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉమ్మడి రాష్ట్రాల్లో మాల సంఘాల జేఏసీ ఏర్పాటు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మాలల్లో ఐక్యతను నింపేందుకు ఉమ్మడి రాష్ట్రాల్లో త్వరలోనే మాల సంఘాలతో జేఏసీ ఏర్పాటు చేస్తున్నట్టు మాల మహానాడు నాయకుడు అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలోనే జేఏసీ కార్యవర్గాన్ని ఎంపిక చేసి, కాకినాడ, అమలాపురంలో సభ నిర్వహించి అధ్యక్షుడిని ప్రకటిస్తామని చెప్పారు. గుంటూరులో జరిగిన మాలల మహాగర్జనను జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. వర్గీకరణపై ప్రభుత్వం పునరాలోచించాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం వచ్చిన ప్రతిసారి మాలమహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు త్యాగాలను గుర్తుచేసుకోవాలని అన్నారు. అన్నవరపు కిషోర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ముడిపెట్టి డీఎస్సీని నిలిపివేయ డం సరైన విధానం కాదన్నారు. తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని లేని పక్షంలో అసెంబ్లీ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామని హెచ్చరించారు.

నిత్య వ్యాయామంతో అనారోగ్యాలు దూరం

గుంటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మంచి ఆహారపు అలవాట్లతో పాటు నిత్య వ్యాయామంతో అనారోగ్యాలు దరి చేరవని ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ డీవీ సీతారామకిషోర్ తెలిపారు. స్థానిక బ్రాడీపేట 4/9వ లోని విజయసాయి ధన్వంతరి ఆయుర్వేద వైద్యశాలలో జండూ కంపెనీ ఆధ్వర్యంలో ఆదివారం ఎముకల పటుత్వంపై ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. రూ. 2వేల వరకు అయ్యే పరీక్షలు ఉచితంగా చేయడంపై ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని సీతారామకిషోర్ తెలిపారు.

పెనుగొండ లక్ష్మీనారాయణకు రేపు అభినందన సభ

గుంటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కవిగా, విమర్శకుడిగా, సంపాదకుడిగా, అనువాదకుడిగా ఐదు దశాబ్దాలుగా విశేష కృషి చేస్తున్న అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించటంపై అవగాహన సంస్థ హర్షం వ్యక్తం చేసింది. ఈ నెల 24న అభినందసభ నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అరండల్‌పేట 15/1వ లైనులోని అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగే అభినందనసభకు పలువురు సాహితీవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు హాజరవుతారన్నారు.

సైబర్ నేరాలపై దృష్టి సారించండి

- సౌత్ కోస్టల్ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి

చీరాలటౌన్/ పర్చూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టిసారించడంతోపాటు నేరాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సౌత్ కోస్టల్ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. చీరాల వన్‌టౌన్, పర్చూరు మండలం కారంచేడు పోలీస్ స్టేషన్‌లను ఎస్పీ తుషార్‌డూడీతో కలిసి ఆయన తనిఖీ చేశారు. అలాగే, స్టేషన్‌లో ఏర్పాటు చేయనున్న కమాండ్ కంట్రోల్ రూంపై ఆరా తీశారు. ఇటీవల డిజిటల్ అరెస్టుల సంఖ్య అధికంగా ఉన్నట్లు వివరించారు. వాట్సాప్ కాల్స్ చేసి కస్టమ్స్, విజిలెన్స్, ఇతర శాఖలతో పేరుతో సామాన్యులకు బెదిరింపు కాల్స్ వస్తే స్టేషన్‌ను సంప్రదించి పరిష్కారం పొందాలని సూచించారు. కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేయడం వలన నేరాలు నియంత్రించవచ్చన్నారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. సముద్రతీరంలో సైతం సీసీ కెమెరా నిఘా పెంచాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎండీ మొయిన్, సీఐ శ్రీనివాసరావు, ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, ఎస్సై వెంకట్రావు పాల్గొన్నారు.



చీరాల వన్‌టౌన్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఐజీ

ఆర్టీసీ సర్వీసుల కండిషన్‌పై డీపీటీవో పరిశీలన

గుంటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సర్వీసుల కండిషన్‌ను తెలుసు కునేందుకు జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) రవికాంత్ ఆదివారం బస్సులో ప్రయా ణించారు. గుంటూరు-2 డిపోలో కండిషన్‌లో ఉన్న బస్సులను డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం, ఏటీఎమ్ సత్యనారాయణతో కలిసి రవికాంత్ ప్రయాణించి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీపీటీవో మాట్లాడుతూ బస్సు ఇంజన్ కండిషన్ మాత్రమే కాదని సీట్లు, జోర్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలన్నారు. బస్సుల కండీ షన్ విషయమై గ్యారేజ్ సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండద్దని, బస్సులు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.



బస్సులో ప్రయాణిస్తున్న డీపీటీవో రవికాంత్, డీఎం అబ్దుల్ సలామ్ తదితరులు

బాధితులతో మర్యాదపూర్వకంగా నడచుకోవాలి: ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాద పూర్వకంగా, సానుకూల ధోరణితో నడుచుకోవాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి సీఐ నజీర్ బేగ్ కు సూచించారు. నగరంపాలెం సీఐగా బాధ్యతలు స్వీకరించిన నజీర్ బేగ్ ఆదివారం ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలో శాంతిభద్రతలపై చర్చించారు. నగరంపాలెం పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలని, గంజాయి బ్యాచ్‌పై ఉక్కు పాదం మోపాలని, ప్రజలకు భరోసా కలిపించే విధంగా పని చేయాలని సూచించారు.



ఎమ్మెల్యేకు మొక్కను బహూకరిస్తున్న సీఐ నజీర్

కలామ్ పురస్కారం అందుకున్న మౌనికశ్రీ


గుంటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏటుకూరు రోడ్డు సూర్య దేవరపేటకు చెందిన బోడేపూడి రామారావు, నాగస్వప్న దంపతుల కుమార్తె మౌనిక శ్రీ జ్ఞాపకశక్తిలో విశేష ప్రతిభ కనబరుస్తోంది. డాక్టర్ చివుకుల హనుమంతరావు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హిందూ ఇంజనీరింగ్ కాలేజీలో ఆదివారం జరిగిన పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో మౌనిక శ్రీకి కలాం ఇన్‌స్పిరేషనల్ అవార్డు అందించారు. విజ్ఞాన మిత్ర డాక్టర్ చివుకుల హనుమంతరావు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చివుకుల సాంబశివరావు, సుగుణ సైన్స్ అకాడమి నిర్వాహకులు, ట్రస్ట్ కార్యదర్శి పత్రి వేణుగోపాల్ ఆధ్వర్యంలో అనేక రాష్ట్రాల నుంచి వివిధ రం గాలలో ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను, విద్యార్థులను గుర్తించి ప్రతి ఏడాది ఈ పురస్కారాలను అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. మౌనికశ్రీ ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలలో జ్ఞాపకశక్తిలో 52 రికార్డులు సాధించింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 178 అవార్డులు అందుకుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అవార్డుతో పాటు ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకుంది. మౌనికశ్రీ ప్రస్తుతం చౌడవరంలోని ఉషోదయ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు ఇద్దరూ ప్రైవేటు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. తల్లిదండ్రులలో పాటు ఉపా ధ్యాయుల ప్రోత్సాహంతో మౌనికశ్రీ ఈ రంగంలో రాణిస్తున్నారు. ఈ పురస్కారం అందుకోవడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని మౌనికశ్రీ అన్నారు. కాగా జ్ఞాపికశక్తి రంగంలో రాణిస్తోన్న మౌనికశ్రీని అందరూ అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాటూరి పబ్లిక్ స్కూల్ డైరక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు, సిటిస్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ సీహెచ్ నాగేశ్వరరావు, హిందూ ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి పాల్గొన్నారు.



మౌనికశ్రీకి అవార్డు అందిస్తున్న డాక్టర్ సాంబశివరావు, వేణుగోపాల్, వెంకటేశ్వరరావు తదితరులు

అర్ధరాత్రి సమయంలో ఎస్పీ ఆకస్మిక పర్యటన

గుంటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాత్రివేళల్లో పరిస్థితులను ఎస్పీ సతీష్‌కుమార్ స్వయంగా పర్యవేక్షించారు. గుంటూరుతో పాటు, చేబ్రోలు, పొన్నూరులో శనివారం రాత్రి ఆయన ఆకస్మికంగా పర్యటించారు. పర్యటించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరి ధిలో రాత్రి సమయాల్లో గస్తీ కోసం ఎన్ని బీట్లు వేసి, ఎంతమంది పోలీస్ సిబ్బందిని కేటాయించారు, వారు ఏయే సమయాల్లో ఏయే ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తున్నారనే పలు అంశాలపై పోలీస్ అధికారులతో చర్చించారు. గస్తీ సమయంలో అర్ధరాత్రి సమయంలో అనవసరంగా రోడ్లపై తిరిగేవారికి కౌన్సెలింగ్ నిర్వహించాలని, ఈ విధంగా తిరిగితే కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువకులు, విద్యార్థులు పార్టీలు, పుట్టినరోజు వేడుకల పేరిట అర్ధరాత్రి సమయంలో రోడ్లపై తిరిగే వారిని అదుపు లోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. వాహనాలను సీజ్ చేసి, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్ధరాత్రి సమయాల్లో బడ్డీకొట్లు, చిల్లర దుకాణాలు తెరవకుండా తగిన ఉత్తర్వులు జారీ చేయాలని, పాటించని వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. చేబ్రోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని నారాకోడూరు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద, నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుడంపాడు మెయిన్ రోడ్డు వద్ద, లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంగడిగుంట అమ్మవారి ఆలయం వద్ద పలువురు యువకులు అనవసరంగా రోడ్లపై గుమికూడగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వాహనాలను పోలీస్ స్టేషన్లకు తరలించి, వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని ఎస్పీ ఆదేశించారు. పొన్నూరు రూరల్ , పొన్నూరు పట్టణ పోలీస్‌స్టేషన్ల పరిధిలో కొన్ని సంవత్సరాలుగా వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వాటి యజమానులకు అప్పగించడమో లేక వేలంపాట నిర్వహించడమో చేయాలని ఆదేశించారు. ఆకస్మిక తనిఖీల్లో జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, తెనాలి డీఎస్పీ జనార్దన్ రావు, పొన్నూరు పట్టణ సీఐ రవి, చేబ్రోలు ఎస్సై వెంకటకృష్ణ, పొన్నూరు ఎస్సై కిరణ్ తదితరులు ఉన్నారు.



గుంటూరులో అర్ధరాత్రి సమయంలో పర్యటించిన ఎస్పీ. అనవసరంగా రోడ్లపై తిరిగేవారిని అదుపులోకి తీసుకుంటున్న సిబ్బంది

గుంటూరు రైల్వే డివిజన్ అధికారులకు కేంద్ర మంత్రి అభినందన

గుంటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్ విభాగాల్లో నూతన ఆవిష్కరణలు చేసిన గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ అధికారులు జేవీ అనూష, ఆది నారాయణలను కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అభినందించారు. న్యూఢిల్లీలో ఆదివారం ఎంఆర్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.భవిష్యత్తులోనూ మరిన్ని కొత్త ఆవిష్కరణలు రూపొందించి రైల్వేకు పేరూ ప్రతిష్ఠలు తీసుకు రావాలని ఈ సందర్భంగా మంత్రి వైష్ణవ్ కోరారు.



రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ నుంచి అవార్డులు స్వీకరిస్తున్న గుంటూరు రైల్వే డివిజన్ అధికారులు అనూష, ఆదినారాయణ



లక్ష్మీనారాయణపురంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే మాధవి

పలు చోట్ల ఘనంగా సెమీక్రిస్మస్

గుంటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసరావుపేటకు సమీ ఎంలోని లక్ష్మీనారాయణపురంలో ఆదివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలలో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి, గుంటూరు మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ క్రీస్తు చూపిన శాంతి మార్గాన్ని అందరూ అనుసరిం చాలని కోరారు. అందరికీ శాంతి, సౌఖ్యం కలగాలని ఆకాంక్షించారు. వేడుకల్లో ఎమ్మెల్యే గళ్లా మాధవి, జనసేన పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు తాళ్ల వెంకటేష్ యాదవ్, జై చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు

సంతోష్‌నగర్‌లో..

గుంటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): యేసుక్రీస్తు బోధనల సారాంశాన్ని మానవాళి గ్రహించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. స్థానిక 28వ డివిజన్‌లోని సంతోష్‌నగర్‌లో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



ఎమ్మెల్యే నసీర్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న చిత్రం

ఎమ్మెల్యే కార్యాలయంలో

శాంతి, కరుణకు మార్గదర్శకుడు ఏసుక్రీస్తు అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రైస్తవులు, ఎస్సీ నాయకులతో కలిసి ఆయన కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గుడిమెట్ల దయారత్నం, బత్తుల భాస్కర్, సుందరం బాబు, చిలక వెంకటస్వామి, చిలక వెంకటేశ్వరరావు, మచ్చు దేవా, మలె పువ్వు రమేష్, నిరంజన్, విజయ్ బాబు, మధు, ఆనంద్, రవి పాల్గొన్నారు.

పేదల కోసమే ఎన్టీఆర్ వైద్య సేవ: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆరోగ్యం కోసం ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత వైద్యాన్ని అందిస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గతంలో ఆయన ఆధ్వర్యంలో అంజుమన్ ఇస్లామియా పాఠశాలలో నిర్వహించిన కంటి వైద్య శిబిరం ద్వారా కంటి ఆపరేషన్ చేయించుకున్న వారికి ఆదివారం తన చేతుల మీదుగా కళ్లజోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కిందటి నెలలో నిర్వ హించిన కంటి వైద్య శిబిరంలో సుమారు 500 మంది కంటి పరీక్షలు చేయించుకోగా అందులో 140 మందికి కంటి ఆపరేషన్ అవసరమైందని, వారికి శంకర్ కంటి ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించామని తెలిపారు. వారికి అవసరమైన మందులు, కళ్ళజోళ్లను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్న వారికి కూడా ఆర్థిక సహాయం అందజేస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో మరెన్నో వైద్య శిబిరాలను నిర్వహించి మరింత మందికి సహాయపడతామని చెప్పారు. కార్యక్రమంలో సంకురి శీను, జమీర్, కోట పిచ్చిరెడ్డి, ఉస్మాన్, చిన్న బుజ్జి, అంజుమన్ కమిటీ సభ్యులు జాహిద్, షాదా, షౌకత్, రెహమాన్, భాషి, అన్వర్ హుసేన్, మక్బూల్ పాల్గొన్నారు.



కళ్లజోళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

కులమతాలకు అతీతంగా క్రిస్మస్ : దేగల ప్రభాకర్

గుంటూరు, డిసెంబరు 22(ఆంధ్ర జ్యోతి): కుల,మతాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రజలంతా జరుపుకునే పండుగ క్రిస్మస్ అని ఆంధ్రప్రదేశ్ ఇండ స్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఐడీసీ) చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. దేగల యూత్ ఆధ్వర్యంలో స్థానిక శారద కాలనీలోని షెకీనా ప్రార్థన మందిరంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాస్టర్ జీ విజయ్‌కుమార్‌తో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పేద వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన బాటలో నడిస్తే ఒక మంచి సమాజాన్ని చూడవచ్చని అన్నారు. కార్యక్రమంలో దేగల యూత్ సునీల్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.




వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న ప్రభాకర్

విద్యుత్ రంగం ప్రైవేటీకరణను తిప్పికొట్టండి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ల పరం కాకుండా రక్షించుకోవడానికి ప్రజలందరూ ఐక్యం కావాలని విద్యుత్ వినియోగదారుల ఐక్య వేదిక పిలుపు నిచ్చింది. విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో స్మార్ట్ మీటర్లు, విద్యుత్ చార్జీల భారాలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ సలీమ్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక విజయవాడ కన్వీనర్ ఎంవీ ఆంజనేయులు ముఖ్య వక్తగా పాల్గొన్నారు. సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో అదానీ ప్రభుత్వ ప్రభుత్వ పెద్దలకు రూ.1700 కోట్ల లంచం ఇచ్చినట్లు ఆధారాలున్నా కేంద్రంగానీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గాని ఎందుకు విచారణ చేపట్టలేదని ఆయన ప్రశ్నించారు. అనంతరం కమిటీ కన్వీనర్‌గా షేక్ అబ్దుల్ సలీమ్‌ను ఎన్నుకున్నారు.

దిక్సూచి DIKSUCHI

ఎస్‌బీఐలో 13,735 క్లర్క్ జాబ్స్



భారతదేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) 13,735 క్లర్క్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ఖాళీలు ఇవి.
హైదరాబాద్ సర్కిల్: 342, అమరావతి సర్కిల్: 50

వయస్సు: అభ్యర్థుల వయస్సు 2024 ఏప్రిల్ 1వ తేదీ నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 1996 ఏప్రిల్ 2 నుంచి 2004 ఏప్రిల్ 1వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ(జనరల్/ఈడబ్ల్యూఎస్) అభ్యర్థులకు పదేళ్లు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

విద్యార్హతలు: ఏ విభాగంలో అయిన గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు దరఖాస్తునకు అర్హులు. అలాగే ప్రస్తుతం డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష కేంద్రాలు: తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, విజయవాడ/గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, విజయనగరంల్లో ఈ కేంద్రాలున్నాయి.

ప్రిలిమినరీ/ మెయిన్స్: ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన ప్రిలిమినరీ పరీక్ష 2025 ఫిబ్రవరిలో, మెయిన్ పరీక్ష 2025 మార్చి/ ఏప్రిల్‌లో జరుగుతుంది.

ఎంపిక: ఈ పరీక్షలను ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు.

ప్రిలిమినరీ పరీక్ష: ప్రశ్న పత్రం మొత్తం వంద మార్కులకు ఉంటుంది. జవాబులను 60 నిమిషాల వ్యవధిలోనే పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందులో కూడా ఒక్కో విభాగానికి కేటాయించిన నిర్ణీత వ్యవధిలోనే సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఇందులో నెగెటీవ్ మార్కింగ్ ఉంటుంది. తప్పుగా జవాబు రాసిన ప్రతీ ప్రశ్నకు 1/4 మార్కును కట్ చేస్తారు. సుమారుగా ప్రతీ ఖాళీకి పదిమంది చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

విభాగం	ప్రశ్నలు	మార్కులు	నిమిషాలు
ఇంగ్లిష్	30 ప్రశ్నలు	30 మార్కులు	20 నిమిషాలు
న్యూమరికల్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు
మొత్తం	100	100	60 నిమి.

మెయిన్ పరీక్ష: ఇందులో 200 మార్కులకు 190 ప్రశ్నలు ఉంటాయి. రెండు గంటల 40 నిమిషాల్లో దీనిని పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందులో కూడా నెగెటీవ్ మార్కింగ్ ఉంటుంది. తప్పుగా సమాధానం రాసిన ప్రతీ ప్రశ్నకు పావు మార్కు కోత విధిస్తారు.

విభాగం	ప్రశ్నలు	మార్కులు	నిమిషాలు
జనరల్ ఫైనాన్షియల్ అవేర్‌నెస్	50 ప్రశ్నలు	50 మార్కులు	35 నిమిషాలు
ఇంగ్లిష్	40 ప్రశ్నలు	40 మార్కులు	35 నిమిషాలు
క్వాంటిటేటీవ్ ఆప్టిట్యూడ్ రీజనింగ్ ఎబిలిటీ &	50 ప్రశ్నలు	50 మార్కులు	45 నిమిషాలు
కంప్యూటర్ ఆప్టిట్యూడ్	50 ప్రశ్నలు	60 మార్కులు	45 నిమిషాలు
మొత్తం	190	200	2 గం. 40 నిమి.

ప్రిపరేషన్ టిప్స్

జనరల్
- ప్రిపరేషన్ ప్రారంభించే ముందే సిలబస్, వెయిటేజీ పట్ల అవగాహన తెచ్చుకోవాలి. వెయిటేజ్ ఆధారంగా ప్రిపరేషన్ మొదలుపెట్టాలి.
- ఎక్కువ సిలబస్ ఉన్న దృష్ట్యా సరైన ప్రణాళికను తయారు చేసుకోవాలి. మెయిటేజీ, కష్టాన్ని బట్టి ఆయా టాపిక్‌కు సమయాన్ని కేటాయించుకోవాలి.
- నిర్ణీత సమయంలో సిలబస్ పూర్తయినప్పటికీ పునశ్చరణ అనేది క్రమం తప్పకుండాలి చేసుకోవాలి. దీంతో పరీక్షహాల్లో వేగంగా సమాధానాలు గుర్తించేందుకు ఉపయోగపడుతుంది.
- బ్యాంకింగ్ తదితర పరీక్షల్లో టైమ్ మేనేజ్‌మెంట్ అనేది చాలా కీలకం. నిర్ణీత సమయంలో జవాబు పూర్తయ్యేలా కృషిచేయాలి. ఒక ప్రశ్నకు ఎక్కువ సమయం పడుతుందనుకుంటే వెంటనే దానిని వదిలేసి ఇంకోదానికి వెళ్లిపోవాలి. చివర్లో టైమ్ మిగిలితే దానిని పూర్తి చేయడానికి ప్రయత్నించాలి.
- మాక్ టెస్ట్‌లు తప్పనిసరి. అభ్యర్థి బలాలు, బలహీనతలు దీనితో బయట పడతాయి. తప్పులు కనిష్ట స్థాయిలో ఉండే విధంగా అభ్యర్థులు సిద్ధం కాగలుగుతారు.

ఇంగ్లీషు
- ఇంగ్లిషు సిలబస్ ఇటీవల కాలంలో చాలా మారింది. అందుకే నిర్లక్ష్యం చేయొద్దు.
- రెనిన్ మార్టిన్ బుక్ నుంచి గ్రామర్ రూల్స్‌ను నేర్చుకోవాలి. ఉదాహరణల ఆధారంగా వాటిని నేర్చుకోవాలి.
- ఇంగ్లిషు ఆర్టికల్స్ రోజు చదవాలి. కొత్త పదాలు రాసుకోవాలి. తరచుగా పునశ్చరణ చేసుకోవాలి.
- క్లోజ్ టెస్ట్, పిల్లర్స్, సెంటెన్స్ కరెక్షన్, స్పాటింగ్ ఎర్రర్స్ చాప్టర్లను ప్రాక్టీసు చేయాలి.

రీజనింగ్
- బేసిక్ కాన్సెప్టులు అర్థం అయితే ఈ సెక్షన్ సులువు.
- పరీక్షలో వచ్చే అవకాశం ఉన్న పజిల్ మోడల్స్ రోజు రెండు మూడు పూర్తి చేయాలి.
- ఇన్ ఈక్వాలిటీ, ఆర్డర్ అండ్ ర్యాంకింగ్, కోడింగ్ అండ్ డీ కోడింగ్, డైరెక్షన్ డిస్టెన్స్, రక్త సంబంధాలు చాప్టర్లు ప్రాక్టీసు చేయాలి.

క్వాంటిటేటీవ్ ఆప్టిట్యూడ్
- స్క్వేర్స్, క్యూబ్స్, టేబుల్స్ బట్టిపట్టాలి.
- పరీక్షలో కాలిక్యులేషన్స్ వేగంగా చేయడానికి వేదిక్ ట్రిక్స్ ప్రాక్టీసు చేయాలి.
- బేసిక్ చాప్టర్లు అయిన నంబర్ సిరీస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, యావరేజ్, రేషియో ప్రపోర్షన్స్, పర్సెంటేజీలు బాగా చూసుకోవాలి.
- బార్ గ్రాఫిక్స్, టాబులర్ డిఐ తదితర డేటా ఇంటర్‌ప్రిటేషన్ సెట్స్ ప్రాక్టీసు ముఖ్యం.

కరెంట్ అఫైర్స్
- క్రమం తప్పకుండా పేపర్ చదవాలి. రెండు మూడు పత్రికల ఎడిటోరియల్ పేజీలు చూడాలి.
- సీఎస్ఆర్ జీకే పుస్తకాలు ఫాలోకావాలి.
- మనోరమ ఇయర్ బుక్ చదివితే మంచిది.

రిఫరెన్స్ పుస్తకాలు
- **క్వాంటిటేటీవ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్:** ఎస్ చాంద్, ఆర్.ఎస్. అగర్వాల్, అరుణ్ శర్మ, ఎంకె పాండే పుస్తకాలు చదవాలి.
- **ఇంగ్లీషు లాంగ్వేజ్:** రెనిన్ మార్టిన్, అరిహంత్ పబ్లికేషన్స్, ఎస్.చాంద్ పుస్తకాలు మంచివి
- **జనరల్ అవేర్‌నెస్:** మనోరమ ఇయర్ బుక్, సీఎస్ ఆర్ జీకే, దిన పత్రికలు
- **బ్యాంకింగ్ అవేర్‌నెస్:** అరిహంత్ పబ్లికేషన్స్

జేఈఈ (అడ్వాన్స్‌డ్) 2025

అడ్మిషన్



దేశ వ్యాప్తంగా ఉన్న ఐఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికిగానూ బీటెక్, బీఆర్క్‌లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ ప్రకటన వెలువడింది. 2025 మే 18న ఎంట్రెన్స్ నిర్వహించనున్నారు. ఫలితాలను జూన్ 2న ప్రకటిస్తారు. 2025 ఏప్రిల్ 23 నుంచి మే 2 వరకు దరఖాస్తులు దాఖలు చేసుకోవచ్చు. దేశ వ్యాప్తంగా 23 ఐఐటీల్లో 17,695 బీటెక్, బీఎస్(బ్యాచిలర్ ఆఫ్ సైన్స్) సీట్లు అందుబాటులో ఉన్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మరికొన్ని సీట్లు పెరిగే అవకాశం ఉంది. జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన 2.50 లక్షల మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్ పరీక్షలు రాయడానికి అర్హులు. ఈ సంవత్సరం పరీక్షలను ఐఐటీ కాన్పూర్ నిర్వహిస్తోంది.

కలికిరి సైనిక్ స్కూల్‌లో టీచర్ ఉద్యోగాలు

జాబ్ కార్నర్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లా కలికిరిలోని సైనిక్ స్కూల్‌లో ఒప్పంద ప్రాతిపదికన పనిచేయడానికి ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నారు. మొత్తం ఏడు ఉద్యోగాలు ఉన్నాయి. స్కూల్ మెడికల్ ఆఫీసర్-1, పీజీటీ(కంప్యూటర్/ మేథ్స్)-2, టీజీటీ(సోషల్ సైన్స్)-1, పీటీఐ కం మ్యాట్రన్-1, కౌన్సెలర్-1, హార్స్ రైడింగ్ ఇన్‌స్ట్రక్టర్-1 ఖాళీలు ఉన్నాయి. 2025 జనవరి 10వ తేదీలోపు దరఖాస్తు పోస్టులో పంపించాలి. పూర్తి వివరాల కోసం https://sskal.ac.in/ వెబ్‌సైట్ చూడొచ్చు.

SCHOLARSHIP ALERT

'LIFE'S GOOD'

Description: LG Electronics India Private Limited invites applications from students pursuing undergraduate and post-graduate courses at select colleges/institutes across India.
Eligibility: Students must be pursuing undergraduate/postgraduate courses (any academic year) from select colleges/institutes across India. First-year students must have scored a minimum of 60% marks in their class 12th examinations, while students in the 2nd, 3rd, and 4th years must have achieved a minimum of 60% marks in the previous academic year. Preference will be given to meritorious students, female students and students with an annual family income of not more than INR 8 lakh.
Prizes & Rewards: Up to INR 100,000 for one year
Last Date: 31-12-2024 *Application mode:* Online only
Short Url: www.b4s.in/aj/LGIGS1

Tata Capital Pankh

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.
Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.
Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less)
Last Date: 15-01-2025 *Application mode:* Online only
Short Url: www.b4s.in/aj/TCPS27

PROMYS India

Description: PROMYS India (Program in Mathematics for Young Scientists) 2025 is offered by PROMYS, an Indian residential mathematics summer program, in partnership with the Indian Institute of Science (IISc.) to the students of classes 9 to 12.
Eligibility: Applicants must be at least 15 years old on May 11, 2025. They must be enrolled in classes 9 to 12 or pre-university courses in a government-funded, government-aided, private, unaided, independent school, sixth-form college, home schools, or other types of secondary and higher secondary schools.
Prizes & Rewards: Selected students will receive a full scholarship covering tuition fees and other benefits.
Last Date to Apply: 15-01-2025
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/PROM2

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

రేవతి కుటుంబాన్ని పరామర్శించా

జగపతి బాబు



సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రేవతి కుటుంబాన్ని తాను పరామర్శించానని, కానీ ప్రచారం చేసుకోలేదని నటుడు జగపతి బాబు అన్నారు. రేవతి కుటుంబాన్ని సినీ పరిశ్రమ నుంచి ఎవరూ పరామర్శించలేదని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఇతర నేతలు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. వీరి వ్యాఖ్యలపై జగపతి బాబు స్పందించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఓ వీడియో సందేశాన్ని పోస్టు చేశారు. 'సినిమా షూటింగ్ పూర్తయ్యాక ఊరి నుంచి తిరిగి రాగానే వెంటనే ఆసుపత్రికి వెళ్లాను. బాధిత కుటుంబాన్ని పరామర్శించాను. శ్రీతేజ తండ్రి, సోదరిని పలకరించా. బాబు కోలుకుంటాడని ధైర్యం చెప్పా. కానీ ప్రచారం చేసుకోలేదు. ఈ విషయం ఎవరికీ తెలియదు. ఇప్పుడు క్లారిటీ ఇవ్వాలని చెబుతున్నా' అని జగపతి బాబు ఆ వీడియోలో పేర్కొన్నారు.



రామ్‌చరణ్‌కు జాతీయ అవార్డు పక్కా

సుకుమార్

"రంగస్థలం'లో అద్భుతంగా నటించిన రామ్‌చరణ్‌కు జాతీయ అవార్డు వస్తుందనుకున్నా. కానీ రాలేదు. ఈసారి 'గేమ్ ఛేంజర్' క్లైమాక్స్‌లో రామ్‌చరణ్ నటనకు జాతీయ అవార్డు పక్కాగా వస్తుంది' అని అన్నారు డైరెక్టర్ సుకుమార్. రామ్‌చరణ్ హీరోగా ఎస్.శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. జనవరి 10న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను డ్రీమ్స్ రాజేశ్ కల్లెపల్లి ఆధ్వర్యంలో డల్లాస్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విదేశీ ప్రేక్షకులు తెలుగు సినిమాల్ని ఎక్కువగా ఆదరిస్తుంటారు. 'వన్' 'నేనొక్కడినే' చిత్రాలను ఇక్కడ ఆదరించి ఉండకపోతే నాకు తర్వాతి సినిమాలు వచ్చేవి కావు' అని అన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ ' క్రికెట్‌కు సచిన్ ఎలాగో...ఇండియన్ సినిమాకు శంకర్ అలా.. అలాంటి డైరెక్టర్‌తో పని చేయడం నా అదృష్టం. నా నుంచి సోలో ఫిల్మ్ వచ్చి ఐదేళ్లు అవుతోంది. ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా' అని అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'ఇది మా బేనర్‌లో 50వ సినిమా. ఇంత పెద్ద బడ్జెట్‌తో నేను ఎప్పుడూ సినిమాలు తీయలేదు. ఓ సాంగ్‌ను డల్లాస్‌లో రిలీజ్ చేస్తున్నామని తెలిసి నాకు సంతోషం వేసింది. రామ్‌చరణ్ వల్లే సినిమా ఈ స్థాయికి వచ్చింది' అని అన్నారు. శంకర్ మాట్లాడుతూ' ప్రభుత్వాధికారి, రాజకీయ నాయకుడి మధ్య వచ్చే ఘర్షణ మీదే ఈ చిత్రం ఉంటుంది. రామ్‌చరణ్ ఎంతో అద్భుతంగా నటించారు' అని అన్నారు.

కించపరిచే పోస్టులొద్దు

● అభిమానులకు అల్లు అర్జున్ విజ్ఞప్తి



సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగతంగా ఎవరినీ కించపరిచేలా పోస్టులు పెట్టొద్దు, మీ అభిప్రాయాలను బాధ్యతాయుతంగా వ్యక్తం చేయండి అని అల్లు అర్జున్ అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా ఓ ప్రకటన విడుదల చేశారు. కొందరు సోషల్ మీడియాలో కావాలనే నకిలీ అకౌంట్ల ద్వారా తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని, ఈ దుష్ప్రచారానికి దూరంగా ఉండాలని కోరారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దీనికి కౌంటర్‌గా అల్లు అర్జున్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి తన వాదనను వినిపించారు. ఈ నేపథ్యంలో అభిమానుల ముసుగులో కొందరు సామాజిక మాధ్యమాల వేదికగా తెలంగాణ ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారు. దీన్ని గుర్తించిన అల్లు అర్జున్ అలాంటి వాటికి దూరంగా ఉండాలంటూ తన అభిమానులకు విజ్ఞప్తి చేశారు.

మర్రిచెట్టు కింద



ప్రమోద్ దేవా, రణధీర్, కీర్తన, ముస్కాన్ రాజేందర్ హీరో, హీరోయిన్లుగా నరేశ్ వర్మ ముద్దం దర్శకత్వంలో శ్రీ నారసింహ చిత్రాలయ బేనర్‌పై తెరకెక్కనున్న చిత్రం 'మర్రిచెట్టు కింద మనోళ్లు' పూజ కార్యక్రమంతో ప్రారంభమైంది. నటుడు బాబు మోహన్ నటీనటులపై క్లాప్ కొట్టారు. ఆర్టిస్టు నాగ మహేశ్ కెమరా స్విచ్చాన్ చేశారు. నటులు పృథ్వీ, రాజీవ్ కనకాల, తెలుగు ఫిల్మ్‌ఛాంబర్ అధ్యక్షులు దామోదర ప్రసాద్, నిర్మాత సి.కళ్యాణ్, టీఎంఏఏ ప్రెసిడెంట్ రష్మీ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబు మోహన్ మాట్లాడుతూ 'బేనర్, టైటిల్, డైరెక్టర్...ఇలా ఈ సినిమాకు అన్నీ పవర్‌ఫుల్‌గానే ఉన్నాయి' అని అన్నారు. చిత్ర దర్శకుడు నరేశ్ వర్మ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరినీ అలరించే విధంగా ఒక మంచి సబ్జెక్టుతో చేస్తున్న చిత్రమిది' అని తెలిపారు.

బెనిఫిట్‌కు బ్రేక్?

'తెలంగాణలో ఇక నుంచి ఎలాంటి బెనిఫిట్ షోలు ఉండవు. సినిమా టికెట్ల ధరలు పెంచబోం. నేను ముఖ్యమంత్రిగా ఉన్నంతవరకూ అనుమతినివ్వను. ఈ కుర్చీలో ఉన్నంతవరకూ మీ ఆటలు సాగనివ్వను' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన హెచ్చరిక టాలీవుడ్‌ను కలవరపరుస్తోంది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన కొత్త మలుపులు తీసుకుంటూ చిత్ర పరిశ్రమ మెడకు చుట్టుకుంటోందనే అభిప్రాయం ఇండస్ట్రీలో వ్యక్తమౌతోంది.

బెనిఫిట్ షోల రద్దు ప్రభావం వెంటనే తెలుగు చిత్ర పరిశ్రమపై కనిపించనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏటా సంక్రాంతికి విడుదలయ్యే పెద్ద హీరోల సినిమాలకు వసూళ్ల పరంగా భారీగా లబ్ధి చేకూరుతుండగా, ఇకపై దీనికి బ్రేక్ పడేలా కనిపిస్తోంది.

సంక్రాంతి చిత్రాలివే...

రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. రూ. 450 కోట్ల భారీ బడ్జెట్‌తో దిల్ రాజు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా లెవెల్లో జనవరి 10న విడుదలవుతోంది. ఈ చిత్రం అన్ని రికార్డులను తిరగరాస్తుందనే అంచనాలు ఉన్నాయి. జనవరి 12న బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వంలో నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డాకూ మహారాజ్' విడుదలవుతోంది. జనవరి 14న వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం విడుదలవుతోంది. బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు లేకపోతే ఈ సినిమాల వసూళ్లు దెబ్బతింటాయి. 'గేమ్ ఛేంజర్'తో పాటు 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రాలను దిల్‌రాజు నిర్మించారు. ఆయనతో పాటు సినీ పెద్దలు ఇప్పటివరకూ ప్రభుత్వ నిర్ణయంపై స్పందించలేదు. ప్రభుత్వంతో ఏమైనా సంప్రదింపులు జరుపుతారా అనేది వేచి చూడాలి.

వసూళ్లలో కీలక పాత్ర



బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న స్టార్ హీరోల సినిమాలకు ఎంతగానో అవసరం. భారీగా ఆరంభ వసూళ్లు తెచ్చుకోవడానికి.. సినిమా త్వరగా బ్రేక్ ఈవెన్ కావడానికి దోహదం చేస్తాయి. ఈ నెల 5న విడుదలైన 'పుష్ప 2' సినిమా తొలిరోజే ఏకంగా రూ.294 కోట్లు రాబట్టడంలో బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు కీలక పాత్ర పోషించాయి. అలాగే ముందురోజు పెయిడ్ ప్రీమియర్ షోలకు సైతం తెలంగాణ ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ సినిమా టికెట్ రేట్లు పన్నులతో కలిపి సింగిల్ స్క్రీన్స్‌లో రూ.1000.. మల్టీప్లెక్సుల్లో రూ.1200లు దాటిపోయాయి. అలాగే రిలీజైన 18 రోజుల వరకూ టికెట్ ధరను పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించింది తెలంగాణ సర్కార్. 'పుష్ప 2'తో పాటు ఈ ఏడాది విడుదలైన 'దేవర', 'కల్కి 2898 ఏ.డీ' చిత్రాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి టికెట్ రేట్ల పెంపునకు అనుమతులు లభించడంతో మంచి ఆరంభ వసూళ్లు దక్కించుకున్నాయి. అయితే, 'పుష్ప 2' ప్రీమియర్స్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందడం.. బాలుడు శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉండడం, అసెంబ్లీలో ఈ ఘటన గురించి ప్రస్తావన రావడం.. అల్లు అర్జున్ ప్రెస్ మీట్ పెట్టడంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. దీని ప్రభావం రానున్న సినిమాలపై పడనుంది.





భారీ బడ్జెట్ సినిమాలకు బెనిఫిట్ షోలు, కొన్ని రోజుల వరకూ టికెట్ ధరల పెంపు, అదనపు ఆటలకు వెసులుబాటు ఇవ్వాలని పరిశ్రమ కోరడం, ప్రభుత్వం అంగీకరించడం జరుగుతోంది. ఒకప్పుడు ఎన్ని సెంటర్లలో వంద రోజులు ఆడిందనేది సినిమా విజయానికి కొలమానంగా ఉండేది. కానీ ఇప్పుడు ఫస్ట్ డే వసూళ్లు.. అడ్వాన్స్ బుకింగ్స్, వారాంతపు వసూళ్లు ప్రామాణికంగా మారాయి. అలా, విజయం కోసం కొత్త పుంతలు తొక్కుతున్న తెలుగు సినిమాకు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ఝలక్ ఇచ్చిందంటున్నాయి పరిశ్రమ వర్గాలు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు



కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

రాజ్‌కమల్ రోడ్డులో అండర్ పాస్ ఏర్పాటు చేయాలి

మంగళగిరి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పశ్చిమ బైపాస్ నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో మంగళగిరి మండలం చినకాకాని గ్రామంలోని రాజ్‌కమల్ రోడ్డు వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరుతూ పలువురు స్థానికులు ఆదివారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చినకాకాని, నిడమర్రు, కంతేరు గ్రామాల ప్రజలు, రైతులు వివిధ కంపెనీలలో పనిచేసే కార్మికులు, వ్యవసాయ కూలీలు నిరంతరం ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. రాజ్‌కమల్ రోడ్డు వద్ద అండర్‌పాస్ ఏర్పాటుచేస్తే మూడు గ్రామాల ప్రజలు, రైతులకు ఎంతో ఉపయుక్తంగా వుంటుందని తెలిపారు. గతంలో పలుమార్లు హైవే అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్యను విన్నవించినా పట్టించుకోలేదన్నారు. మూడు గ్రామాల ప్రజల ఇబ్బందులను గుర్తించి అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మన్నెం శ్రీనివాసరావు, పొన్నెకంటి కొండలరావు, పోతినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వక్తృత్వంలో కాకుమాను విద్యార్థిని ప్రతిభ



విద్యార్థి శాశ్విత

కాకుమాను, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో జరిగిన వక్తృత్వ పోటీలలో కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బొనిగల శాశ్విత ద్వితీయ స్థానంలో నిలిచిందని హెచ్‌ఎం సత్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల న్యాయం కొరకు వర్చువల్, డిజిటల్ విచారణ అనే అంశంపై 9వ తరగతి విద్యార్థిని శాశ్విత జిల్లాస్థాయిలో రాణించడం హర్షణీయం అని ఎంఈవో కెన్నడీ అన్నారు. శాశ్వితకు ఎంఈవో-2 విజయభాస్కర్, ఉపాధ్యాయులు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది అభినందించారు.

అమిత్‌షాను సస్పెండ్ చేయాలి

● ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి మదనమోహనరెడ్డి

ప్రత్తిపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భారత పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను సస్పెండ్ చేయాలని ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి మదనమోహనరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అమిత్‌షాను మంత్రి వర్గం నుండి తప్పించి, పార్లమెంట్ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి మోడీకి అంబేడ్కర్‌పై ఎలాంటి గౌరవం ఉన్నా ఆయనపై అనుచిత వాఖ్యలు చేసిన వారికి మద్దతు పలకరాదని హితవు పలికారు.

గ్రామీణ మహిళల వస్త్రాలు, బ్యాగ్‌లకు విశేష ఆదరణ

● ఇన్‌చార్జి ఎంపీపీ జబీన్



చీరెలు, జూట్‌బ్యాగ్‌ల స్టాల్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీపీ జబీన్, సర్పంచ్ మాణిక్యం ఎంపీటీసీ రోజ మరియమ్మ

దుగ్గిరాల, డిసెంబరు 22: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు తయారుచేసిన డిజైన్ చీరెలు, జూట్‌బ్యాగ్‌లు, ఇతర వస్త్రాలకు విశేష ఆదరణ లభిస్తోందని ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. చిలువూరులో ఏర్పాటుచేసిన చీరెలు, బ్యాగుల స్టాల్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. మహిళల స్వయం ఉపాధికోసం మంత్రి లోకేశ్ దుగ్గిరాల మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కుట్టు శిక్షణలో మహిళలు, శిక్షకురాలు అలేఖ్య నేతృత్వంలో ఆకర్షణీయంగా డిజైన్ చీరెలు, జూట్‌బ్యాగులను రూపొందించారు. గ్రామస్తులు వీటిని కొనేందుకు ఆసక్తి చూపడం అభినందనీయమని జబీన్ అన్నారు. సర్పంచ్ చిలువూరు మాణిక్యం, ఎంపీటీసీ రోజమరియమ్మ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు తోటకూర సీతారామయ్య, ఏసుపాదం, శేషగిరి, సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

తాడికొండ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి నలుగురికి గాయాలైన సంఘటన తాడికొండ-కంతేరు రోడ్డులో ఆదివారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం తమిళనాడు రాష్ట్రానికి చెందిన కొందరు భవానీ మాలధరించి విజయవాడ కనకదుర్గ అమ్మవారికి ఇరుముడులు చెల్లించుకున్నారు. తరువాత అమరావతి లోని అమరేశ్వరస్వామి ఆలయానికి మూడు ఆటోలలో పయనమయ్యారు. ఈ క్రమంలో ఎర్రవాగు బ్రిడ్జి మలుపు వద్దకు రాగానే ఎదురుగావచ్చిన ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఆటోలో ఆరుగురు పెద్దలు, ఇద్దరు చిన్నారులున్నారు. వారిలో నలుగురికి గాయాలయ్యాయి. 108లో వీరిని జీజీహెచ్‌కు తరలించారు.

భారీ స్కోరు దిశగా ఉత్తరాఖండ్



మయాంక్ (104 నాటౌట్)

మంగళగిరి సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా కర్ణాటక, ఉత్తరాఖండ్ జట్ల మధ్య మూడు రోజుల మ్యాచ్ ఆదివారం ప్రారంభమైంది. తొలుత టాస్ గెలిచిన ఉత్తరాఖండ్ బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 288 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఉత్తరాఖండ్ బ్యాటర్లు మయాంక్ ముదిల 132 బంతుల్లో 104, అనయ నేగి 230 బంతుల్లో 90, ఆదిత్య 124 బంతుల్లో 61 పరుగులు చేశారు. కర్ణాటక బౌలర్లు కె.గగన్ సాయి, జి.వెంకటేష్, కె.ప్రీతమ్ రాజ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

మల్లీశ్వరికి జ్యోతిష్యశిరోమణి పురస్కారం

దుగ్గిరాల, డిసెంబరు 22: దుగ్గిరాలకు చెందిన సంస్కృత అధ్యాపకురాలు బండి నాగమల్లీశ్వరి జ్యోతిష్యశిరోమణి పురస్కారం అందుకున్నారు. తెనాలి ఎన్నారై, హైద్రాబాద్‌లోని ఎన్నారై జూనియర్ కళాశాలలో పనిచేసిన మల్లీశ్వరి ఎంఏ ఆస్ట్రాలజీ పూర్తిచేయడంతోపాటు కేపీ ఆస్ట్రాలజీ, భృగునాటి అనే విషయంపై చేసిన పరిశోధనకుగానూ, ఇటీవల తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో జరిగిన ఆస్ట్రాలజీ సెమినార్‌లో ఆర్యన్ ఆస్ట్రాలజీ రీసెర్చ్‌సెంటర్, ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్(అమెరికన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ గౌరవపురస్కారం ప్రదానం చేశారు. ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో వ్యవస్థాపకుడు నరసింహస్వామి, టీటీడీ ప్రధాన అర్చకుడు రంగాచారి, పలువురు ఆస్ట్రాలజీ రీసెర్చ్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



తిరుపతిలో జ్యోతిష్యశిరోమణి పురస్కారం అందుకుంటున్న మల్లీశ్వరి

భూ సమీకరణకే భూములిస్తాం..

● రైతులు నష్టపోకుండా ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలి
● గ్రీన్‌జోన్ పెట్టకుండా పోరాడాలి
● న్యాయం జరగకపోతే పోరాటమే మార్గం



సమావేశంలో మాట్లాడుతున్న రైతులు

తాడికొండ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రైల్వేలైన్ నిర్మాణానికి భూ సమీకరణ ద్వారానే భూములు ఇస్తామని రైతులు తేల్చి చెప్పారు. ఆదివారం తాడికొండ, మోతడక, కంతేరు, కొప్పురావూరు, కర్లపూడి గ్రామ రైతులు స్థానిక సాయిబాబా కళ్యాణ మండపంలో సమావేశాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల పొలాల్లో నుంచి ఏయే ప్రాజెక్టు వస్తున్నాయి, వాటికి ఎంత భూమి అవసరం అవుతుంది, రైతులకు జరిగే నష్టం ఏంటనే విషయాలను ప్రొజెక్టర్ ద్వారా రైతులకు వివరించారు. ఈసందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే ప్రాజెక్టుల పరిధిలోని ఉన్న రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజధాని నిర్మాణ పనులు, ఔటర్, ఇన్నర్ రింగ్ రోడ్డు, కనెక్టవిటి రోడ్లు వేయటానికి, నంబూరు నుంచి ఎర్రుపాలెం వరకు రైల్వే లైన్ నిర్మాణం వంటి పనులు ఊపందుకున్నాయన్నారు. వీటికి సంబంధించి నోటిఫికేషన్ ప్రచురించన తర్వాత 30 రోజుల్లో తమ అభ్యంతరాలు తెలియజేశామన్నారు. అయితే అధికారుల వద్ద నుంచి స్పందనే లేదన్నారు. ఈ విషయమై ఇప్పటికే కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ దృష్టికి సమస్యలను తీసుకువెళ్లామన్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు గ్రీన్ జోన్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతారని వాపోయారు. రైల్వే లైన్ వెళ్లే ప్రతి గ్రామంలోని రైతులు కలిసికట్టుగా కూర్చొని కమిటీలు ఏర్పడి ముందుకు వెళ్లాలన్నారు. రైతులకు న్యాయం జరగకపోతే న్యాయపోరాటం చేస్తామన్నారు. రైతులు అంగీకారం లేకుండా పనులు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన పెగ్ మార్కులను తొలగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంచర్ల శివరామయ్య, ఎడ్డూరి హనుమంతరావు, యడ్లపల్లి సాంబశివరావు, వైసీపీ నాయకులు తుమ్మల రామస్వామిరెడ్డి, సీపీఎం నాయకులు చింతల భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాల ప్రజాప్రతినిధులు వున్నా ఉపయోగం లేదు

● తాడేపల్లిలో రాష్ట్ర మాల ఉద్యోగస్తుల ఐక్య సమ్మేళనం
● అపాయింట్‌మెంట్ ఇవ్వని మంత్రులు, అధికారులు



మాట్లాడుతున్న మాల ఉద్యోగుల సంఘం నేతలు

తాడేపల్లి టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏపీలో మాలకులానికి సంబంధించి 15మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు ఉన్నా వారివల్ల ఉపయోగం లేదని, మాల కమ్యూనిటి ఎంపీలు, ఎమ్మెల్యేలే కుంటిసాకులు చెప్పి తప్పించుకుంటున్నారని వారి ప్రాధాన్యం తగ్గించుకుంటున్నారని రాష్ట్ర మాల ఉద్యోగస్తుల ఐక్య సమ్మేళనం నేతలు వ్యాఖ్యానించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఆదివారం రాష్ట్ర మాల ఉద్యోగస్తుల ఐక్య సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ మాల కులం ద్వారా సీట్లు నెగ్గి, మాలల సమస్యలపై కనీసం మాట్లాడడం లేదని, భవిష్యత్తులో వారికి తగిన బుద్ది చెబుతామన్నారు. మాల ఉద్యోగుల రిజిస్ట్రేషన్ సంఘానికి ఎందుకు గుర్తింపు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సమస్యలు చెబుదామంటే సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని వాపోయారు. ఎస్సీ ఎస్టీ ఉద్యోగులను ప్రభుత్వాలు వేధిస్తున్నాయన్నారు. గత ప్రభుత్వంలో మాలలకు అన్యాయం జరిగిందని, నేడు కూటమి ప్రభుత్వం కూడా అన్యాయం చేస్తూ ఎస్సీలను దూరం పెడుతోందని ఉద్యోగ సంఘాల నేతలు వ్యాఖ్యానించారు. ఏసీబీ దాడులు ఒక్క ఎస్సీ వర్గ ఉద్యోగులపై మాత్రమే జరుగుతున్నాయని, మిగతా వర్గాలపై ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నూతలపాటి జగదీష్, మాల కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్, మల్లెల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, మాల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయ్‌కుమార్, మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు, ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, మాల ఉద్యోగుల సంఘం చైర్మన్ నూతలపాటి జగదీశ్, పీఎస్ఎన్ మూర్తి, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్, దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు, అంబేడ్కర్ ఆశయ సమాజ్ జాతీయ అధ్యక్షుడు దండేల కృష్ణ, జైభీమ్ పీపుల్స్ జేఏసీ జాతీయ అధ్యక్షుడు అంబటి కొండలరావు, చీకటి మంగరాజు, గోదా జాన్‌పాల్, మేడికొండ ప్రసాద్, తెనాలి కిషోర్, చప్పిడి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో ఆధ్యాత్మిక సౌరభం

● వైభవంగా ధనుర్మాస మహోత్సవాలు



గోదాదేవికి పూజలు చేస్తున్న చినజీయర్‌స్వామి

మంగళగిరి సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలోని బాపూజీ విద్యాలయంలో యదుకుల తిలకరత్న ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న ధనుర్మాస వ్రత మహోత్సవాలు, శ్రీకృష్ణ దీక్షా మహోత్సవాలు వైభవంగా సాగు తున్నాయి. త్రిదండి చినశ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో వేదపండితుల మంత్రోచ్చరణలతో దీక్షాప్రాంగణం మార్మోగుతోంది. ఏడోరోజైన ఆదివారం చినజీయర్‌స్వామి ఏడో పాశురాన్ని భక్తులకు వివరించారు. అనంతరం గోదాదేవి అమ్మవారికి అష్టోత్తరం, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించి భక్తులకు మంగళాశాసనాలు అందించారు. పెద్దసంఖ్యలో మహిళలు గోదాదేవికి సారెను సమర్పించారు. కార్యక్రమంలో వైటీఆర్ ట్రస్టు చైర్మన్ యద్రాకుల తులసీరామ్ యాదవ్, చినజీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు పాల్గొన్నారు.

ప్రేమ, క్షమా గుణాలు క్రైస్తవ్యానికి మూల సూత్రాలు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్

ఫిరంగిపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రేమ, క్షమా గుణాలు క్రైస్తవ్యానికి మూల సూత్రాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ కుమార్ అన్నారు. ఆదివారం ఫిరంగిపురంలోని టీడీపీ మండల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. జీసస్ ప్రేమ, క్షమాగుణాలతో పాటు తోటివారిని గౌరవించి మానవులకు చూపించారని తెలిపారు. జీసెస్ దేవుని కుమారునిగా ప్రకటించుకోవటం, ఆయన శిష్యులు అనేక సందార్భాల్లో దేవుని కుమారుడిగా నిరూపించటం జరిగిందన్నారు. బాల ఏసు చర్చి ఫాదర్ జోసెఫ్ మాట్లాడుతూ క్రిస్మస్ ద్వారా సమస్త ప్రజలకు శుభ సమాచారం వచ్చిందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు మాట్లాడుతూ తోటి వారిని ప్రేమించటం, శాంతి సమాధానాలతో ఉండటమే క్రిస్మస్ సందేశం అన్నారు. కార్యక్రమానికి పెరికల హృదయరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బాల బాలికల నృత్యాలు ఆకర్షించాయి. తొలుత భారీ కేక్‌ను ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ కట్ చేసి పంపిణీ చేశారు. సభలో జిల్లా టీడీపీ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు, కోటా శేషారావు, బంధనాధం జ్యోతి, గోలి బాలజోజి, పుల్లా ఆడమ్స్, గుండెగ జోజప్ప తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జవహర్‌లాల్

మంగళగిరి సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి వీసం వెంకట జవహర్‌లాల్ డిమాండ్ చేశారు. మంగళగిరి సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలను పెంచబోమని చెప్పిన కూటమి నేతలు, అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ప్రజలపై రూ.18 వేల కోట్ల భారాన్ని మోపారని ఆరోపించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంబేడ్కర్‌ను హేళనగా మాట్లాడడం దారుణమన్నారు. సమావేశంలో సీపీఎం నేతలు బాలాజీ, చెంగయ్య, రాఘవులు, పీ బాలకృష్ణ, ఎం.చలపతిరావు, టీ శ్రీరాములు, గణేష్, జే బ్రాహ్మణి, ఎం.చంద్రారావు, ఆర్.వేణు, కే శ్రీనివాసరావు, పీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అదనపు భారాలు వేస్తున్న కూటమి ప్రభుత్వం

తాడేపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజలపై విద్యుత్ అదనపు భారాలు వేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజలను ఇబ్బంది పెడుతోందని నిరసిస్తూ కుంచనపల్లిలో విద్యుత్ బిల్లులను ఆదివారం దహనం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి పల్లె కృష్ణ మాట్లాడుతూ వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేసి కేంద్ర ప్రభుత్వ విధానాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కాజ వెంకటేశ్వరరావు, అమ్మిశెట్టి రంగారావు, బడుగు వెంకటేశ్వరరావు, హరీష్, సుబ్బారావు, చిన్నబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ పంపిన పెళ్లి కానుక అందజేత

తాడేపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): వడ్డేశ్వరం గ్రామానికి చెందిన షేక్ బుడేసా-బాజిల కుమార్తె హుస్సేన్‌బీ-షేక్ యాసిన్‌ల వివాహం సందర్భంగా మంత్రి నారా లోకేశ్ పంపిన పెళ్లి కానుకను టీడీపీ నేతలు కాట్రగడ్డ మధుసూదనరావు, ఈపూరి కోటయ్య తదితరులు అందజేసి వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చావలి సురేష్, షేక్ నాగుర్‌వలి, షేక్ ఇమాంసా, షేక్ మస్తాన్‌వలి, షేక్ అబ్దుల్ గఫూర్, కాట్రగడ్డ లక్ష్మి, రవి, మస్తాన్‌వలి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

66 మద్యం సీసాలు స్వాధీనం

తాడికొండ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నిడుముక్కల గ్రామంలో అక్రమంగా మద్య విక్రయిస్తున్న వ్యక్తి నుంచి 66 మద్యం సీసాలు ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. నిడుముక్కల గ్రామానికి చెందిన తలతోటి శేషయ్య మద్యం షాపుల్లో మద్యం కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 10 వైటల్ సీసాలు, 56 క్లాసిక్ బ్లూసీసాలతో పాటు రూ.800 నగదును స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జోజి పేర్కొన్నారు.

వడ్డేశ్వరంలో కళావేదిక ప్రారంభం



నూతన కళావేదికపై సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని ఆంధ్రా ఇవాంజిలికల్ చర్చి కాంపౌండ్‌లో వడ్డేశ్వరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత కాట్రగడ్డ మధుసూదనరావు మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో తన సొంత నిధులు రూ.3.20లక్షలు వెచ్చించి కళావేదిక నిర్మించారు. ఈ కళావేదికను ఆదివారం పాస్టర్ రిచర్ట్ ప్రారంభించారు. అనంతరం సెమీ క్రిస్మస్ నిర్వహించి కేక్ కట్ చేశారు. తదుపరి వడ్డేశ్వరం గ్రామానికి చెందిన 21 మంది పాస్టర్‌లకు వారి చర్చిల వద్ద మంత్రి లోకేశ్ పంపిన నూతన వస్త్రాలు, కిస్మస్ కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దాత కాట్రగడ్డ మధుసూదనరావు, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు బొర్రా కృష్ణవందన, గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, మద్దినేని సుబ్రహ్మణ్యం, షేక్ ఇమాంసా, కాట్రగడ్డ గోపాలకృష్ణయ్య, లక్ష్మణరావు, కత్తిక శ్రీరాములు, బాబూరావు, దామోదర్, గణేష్, సురేష్, అబ్రహాం, నాగూర్, నాగూర్‌వలి, దాను, మధు, భీముడు, సాంబశివరావు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌లో సత్వర న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించాలి

● డీఎస్పీ మల్లికార్జునరావు



కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ మల్లికార్జునరావు

వట్టిచెరుకూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలతో మమేకమై స్నేహభావంతో మెలగటం ద్వారా ప్రజల మన్ననలను పొందవచ్చని సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు సూచించారు. వట్టిచెరుకూరులోని పోలీసుస్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా ఆదివారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. నిత్యం గ్రామాల్లో ప్రత్యేక నిఘా పెంచటం ద్వారా అసాంఘిక కార్యకలాపాలను అరికట్టవచ్చన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే సహించవద్దన్నారు. మండలంలోని రౌడీషీటర్ల పూర్తి సమాచారం వారి కార్యకలాపాలపై దృష్టి పెట్టాలన్నారు. ఎలాంటి ఫిర్యాదు వచ్చినా అర్జీదారులకు సరైన న్యాయం జరుగుందనే భరోసా ప్రజల్లో కల్పించాలన్నారు. సీఐ రమానాయక్, ఎస్ఐ సుబ్బారావు పాల్గొన్నారు.

ఉండవల్లిలో త్రైత భగవద్గీత గ్రంథాల ప్రచారం

తాడేపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లిలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక గుంటూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక గుంటూరు కమిటీ సభ్యులు రౌతు శ్రీనివాసరావు, టీవీ కృష్ణారావు, శివలింగం నాయక్, బ్రహ్మం, శ్రీను, హరిబాబు, సుబ్బారావు, విద్య, జయలక్ష్మి, దిల్‌షా, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

అక్షయపాత్ర సేవలు అభినందనీయం

● గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



ఎమ్మెల్యే రాముకు జ్ఞాపికను అందజేస్తున్న వంశీధర దాస

మంగళగిరి సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అన్నార్తుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా అక్షయపాత్ర ఫౌండేషన్ సేవలు అభినందనీయమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళగిరి మండలం ఆత్మకూరులో వున్న అక్షయపాత్ర ఫౌండేషన్ కేంద్రీకృత వంటశాలను ఆదివారం ఆయన సందర్శించారు. హరేకృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సెంట్రల్ రీజియన్ అధ్యక్షుడు వంశీధర దాస అక్షయపాత్ర సేవలను వివరించారు. సీఎం చంద్రబాబు నాయుడు కేటాయించిన మూడెకరాల భూమిలో ఏపీలోనే అతిపెద్ద వంటశాలను ఏర్పాటుచేశామన్నారు. ప్రతిరోజు 30వేల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్నామని, అన్న క్యాంటిన్ల ద్వారా రోజూ 40వేల మందికి భోజనం అందిస్తున్నామని చెప్పారు. కిచెన్ నిర్వహణ, శుభ్రతపై ఎమ్మెల్యే రాము సంతృప్తిని వ్యక్తం చేశారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

మంగళగిరి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): భారత విద్యార్థి సమాఖ్య మంగళగిరి శాఖ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అహ్మద్, కార్యదర్శిగా పఠాన్ సమీర్, ఉపాధ్యక్షులుగా జానీ, బాషా, అలీ, వెంకట సాయిచరణ్, నిర్మల్, సహాయ కార్యదర్శులుగా అబ్దుల్ గని, సుభానీ, మణికంఠ, అబ్దుల్ షానవాజ్, సాయిబాలాజీ తదితరులను ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ నూతన కమిటీ ప్రతినిధులు రాబోయే రోజుల్లో విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఘనంగా నిర్మల హైస్కూల్ వార్షికోత్సవం

మంగళగిరి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నిర్మల ఇంగ్లీషు మీడియం పాఠశాల 42వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ కే శకుంతల, పాఠశాల కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ యూ శౌరీలు, గోపు జోసెఫ్‌రెడ్డి, డాక్టర్ బాసా విజయ్‌కుమార్, పాఠశాల కరస్పాండెంట్ జాన్‌పాల్, ప్రిన్సిపాల్ జ్ఞానసౌందరి పాల్గొన్నారు.

పశ్చిమడెల్టాకాల్వకు 1902 క్యూసెక్కుల

దుగ్గిరాల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 98 క్యూసెక్కుల నీరు, తూర్పుకాల్వకు 66 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 72, కొమ్మమూరుకాల్వకు 1376 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

మానవ సామాజిక అభివృద్ధిలో గణితశాస్త్రానికి ప్రముఖ స్థానం



రావి శ్రీనివాసరావును సన్మానిస్తున్న చలపతి కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది

తాడికొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గణితశాస్త్రం మానవ సామాజిక అభివృద్ధిలో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నదని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గణితశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ రావి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం గణితశాస్త్ర పితామహుడు, శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు గణితంలో రాణించగలిగితే అన్ని రంగాలలో ఉన్నత స్థానాలు సాధిస్తారన్నారు. రామానుజన్ జీవిత చరిత్ర స్కిట్ రూపంలో చేసిన ప్రదర్శన అకట్టుకున్నది. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ జె లక్ష్మీనారాయణ, డాక్టర్ ఏ రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఉత్తేజ్, ఎష్టా దంపతులకు శుభాకాంక్షలు చెబుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు,గళ్లా మాధవి తదితరులు

వేడుకగా తాడిశెట్టి వివాహ రిసెప్షన్

● ఉత్తేజ్, ఎష్ణా దంపతులకు ప్రముఖుల ఆశీస్సులు

గుంటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నగర మాజీ డిప్యూటీ మేయర్, టీడీపీ నేత తాడిశెట్టి మురళీమోహన్ కుమారుడు ఉత్తేజ్, ఎష్ణల వివాహ రిసెప్షన్ కార్యక్రమం శనివారం రాత్రి మహాత్మాగాంధీ ఇన్నర్‌రింగ్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్‌లో వేడుకగా జరిగింది. ఈ నెల 14న ఉత్తేజ్, ఎష్ణల వివాహ వేడుక ఢిల్లీలో జరిగింది. కాగా, తాడిశెట్టి మురళీమోహన్, ఆయన సోదరుడు మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకటరావుల ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన రిసెప్షన్‌కు పెద్ద ఎత్తున ప్రముఖులు హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు. రిసెప్షన్ పురస్కరించుకొని వచ్చే అతిథులకు సరికొత్త రుచులతో ఆతిధ్యం ఇచ్చారు. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి (గుంటూరు పశ్చిమ), ప్రత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట), బూర్ల రామాంజనేయులు (ప్రత్తిపాడు), భాష్యం ప్రవీణ్ (పెదకూరపాడు), తెనాలి శ్రావణ్‌కుమార్(తాడికొండ), నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు నంబూరు సుభాని, మద్దాళి గిరిధర్, సింగర్ సంధ్య పలువురు ప్రముఖులు హాజరయ్యారు. మంత్రి నారా లోకేశ్ పంపించిన పట్టు వస్త్రాలను నూతన వధూవరులకు టీడీపీ నేతలు అందజేశారు.

ఆకట్టుకున్న కొండవీటి జ్యోతిర్మయి కీర్తనలు

ప్రముఖ ఆధ్యాత్మిక గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి ఆలపించిన శ్రీవారి కీర్తనలు ఆకట్టుకున్నాయి. రిసెప్షన్ సందర్భంగా కొండవీటి జ్యోతిర్మయి కీర్తనలు ఆలపించేలా ప్రత్యేకంగా వేదికను ఏర్పాటు చేశారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

సమస్త విజ్ఞాన సర్వస్వం భగవద్గీత: బీజేఎస్ మూర్తి

తెనాలి అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత మత గ్రంథమే కాదని సమస్త విజ్ఞాన సర్వస్వమని విశ్రాంత అధ్యాపకుడు బీజేఎస్ మూర్తి చెప్పారు. కవిరాజా పార్కులో ఆదివారం నిర్వహించిన వాకర్స్ క్లబ్ సమావేశంలో భగవద్గీత-భక్తి యోగం అనే అంశంపై ప్రసంగించారు. గురుశిష్యులు నరనారాయణుల సంవాదంగా భగవద్గీతను వర్ణించారు. భక్తి భావాన్ని ప్రేరేపిస్తుందని, గీతా సారాన్ని తెలుసుకునేందుకు ప్రపంచమంతా ఆసక్తి చూపుతుందన్నారు. గుత్తా వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన సమావేశంలో మూర్తిని సత్కరించారు. రవిబాబు, రత్తయ్య, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



రేషన్ బియ్యంను పరిశీలిస్తున్న అర్బన్ పోలీసులు

210 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరు టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 210 కిలోల రేషన్ బియ్యంను అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అర్బన్ ఎస్ఐ వి.శ్రీహరి కథనం ప్రకారం శనివారం రాత్రి పట్టణంలోని ఎస్‌వీపీ రోడ్‌లో జామియా చౌక్ మసీదు రోడ్డులో బియ్యం ఉన్నాయని సమాచారంతో సోదాలు నిర్వహించినట్లు చెప్పారు. నూకల సుబ్బారావు అనే వ్యక్తి ఇంటి వద్ద నిల్వ ఉన్న 210 కిలోల రేషన్ బియ్యంను గుర్తించి స్వాధీనం చేసుకోవడంతోపాటు సుబ్బారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

● జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

కొల్లిపర, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ నిర్వహించారు. పోలీసుస్టేషన్‌లో రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను, మహిళా పోలీసు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏడాది పోలీసుస్టేషన్‌లో వార్షిక తనిఖీ జరుగుతుందన్నారు. తనిఖీలో భాగంగా కొల్లిపర పోలీసుస్టేషన్‌కు రావటం జరిగిందని తెలిపారు. గత ఏడాదితో పోల్చుకుంటే నేరాలు తగ్గాయా ... పెరిగాయా అనే దాని గురించి తెలుసుకున్నట్లు తెలిపారు. గంజాయి, సైబర్ క్రైమ్ సంబంధించి పోలీసులకు తగిన సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. తనిఖీలో డీఎస్పీ జనార్ధనరావు ఉన్నారు.

సుద్ధపల్లిలో పూరిళ్ళు దగ్ధం

పొన్నూరు టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సుద్ధపల్లిలో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం శనివారం అర్ధరాత్రి కోడూరు ప్రభుదాస్, కొమ్ము తంబి గృహాలకు విద్యుదాఘాతంతో నిప్పంటుకుంది. మంటలు చెలరేగడంతో గాఢ నిద్రలో ఉన్న బాధిత కుటుంబాలు ప్రాణాలు దక్కించుకునేందుకు వస్తు సామగ్రి వదిలి ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. మంటలు చుట్టుముట్టి గృహాల్లో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లు పేలిపోయాయి. మంటలో రెండు పూరిళ్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధిత కుటుంబం వెల్లడించింది.

ప్రింటర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

తెనాలి అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాస్టర్స్ ప్రింటర్స్ అసోసియేషన్ తెనాలి శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం కొత్తపేట పెన్షనర్స్ హాలులో నిర్వహించారు. అధ్యక్షుడిగా బి.అమర్‌నాథ్, కోశాధికారి ఉమామహేశ్వరరావు, కార్యదర్శి ఆర్.శివశంకర్, ఉపాధ్యక్షుడిగా వరప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా రాఘవేంద్రకుమార్, శివకృష్ణ ఎన్నికయ్యారు. ప్రింటింగ్ రంగంలో వస్తున్న అధునాతన మార్పులకు అనుగుణంగా వ్యవహరించాలని అధ్యక్షుడు కోరారు. సమస్యలు ఎదుర్కొనే సభ్యులు కమిటీ దృష్టికి తేవాలని కోరారు.

వైద్యరంగంలో పెరుగుతున్న ఫిజియోథెరపీ ప్రాధాన్యం

● ఐఎంఏ అధ్యక్షుడు అనీల్‌కుమార్

తెనాలి అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో ఫిజియోథెరపి ప్రాధాన్యం క్రమేణా పెరుగుతోందని ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కె.అనీల్‌కుమార్ చెప్పారు. గంగానమ్మపేటలో సంజన ఫిజియోథెరపీ సెంటర్ 10వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. నూతనంగా ఏర్పాటుచేసిన పీడీయాట్రిక్ విభాగాన్ని ఆయన ప్రారంభించారు. దశాబ్ద కాలంలో తెనాలి పట్టణంలో కూడా అత్యాధునిక ఫిజియోథెరపీ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. చిన్న పిల్లల కోసం కూడా ఈ విభాగాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బండారు రవికాంత్, డాక్టర్ కంభం వెంకటకుమార్, విష్ణుప్రియ, హారిక, భానుశ్రీ పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలకు మహర్దశ

● పీఎంశ్రీ నిధులతో అభివృద్ధి ● ఒక్కో పాఠశాలకు రూ.5 లక్షలు

తెనాలి అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల క్రీడా ప్రాంగణాలకు మహర్దశ పట్టింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి స్కూల్స్ రైజింగ్ ఇండియా పథకం నిధులు కేటాయించడంతో అభివృద్ధి బాట పట్టాయి. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న ఉన్నత పాఠశాలలను తొలి విడత ఈ పథకం కింద గుర్తించారు. ఆట స్థలాలను మెరక చేసి విద్యార్థులు ఆడుకునేలా తీర్చిదిద్దేందుకు విడతల వారీగా నిధులు అందిస్తున్నారు. ఒక్కో పాఠశాలకు ఈ పథకం కింద రూ.5 లక్షలు కేటాయించారు. ఇప్పటి వరకు రెండు విడతలు రూ.2 లక్షలు అందాయి. ప్రతి పాఠశాల ఆట స్థలంలో మూడు ఆటలకు సంబంధించిన కోర్టులను పక్కాగా తీర్చిదిద్దేందుకు ఈ



మురుగు చేరి అధ్వానంగా ఉన్న పాఠశాల ఆటస్థలం



అభివృద్ధి చేస్తున్న ఆట స్థలాలు

నిధులు వినియోగించారు. వాలీబాల్, బాల్‌బాడ్మింటన్, ఖోఖో వంటి క్రీడలకు అవసరమైన కోర్టులకు పోల్స్ ఏర్పాటుచేసి గ్రావెల్‌తో చదును చేసి పటిష్టం చేస్తున్నారు. ప్రతి మండలంలో ఒక ఉన్నత పాఠశాలను ఈ పథకం కింద గుర్తించగా ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పర్యవేక్షణలో ఆట స్థలాల అభివృద్ధి చురుకుగా సాగుతోంది. మిగిలిన విడత రూ.3 లక్షలు నిధులతో క్రీడలకు అవసరమైన పరికరాలు, ఇంకా మెరక వేసుకునే పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు గుర్తించి చేయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఆట స్థలాలు పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకుంటాయని భావిస్తున్నారు. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఆటలాడుకునేందుకు అనువైన క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసేందుకు కారణమైన కేంద్ర ప్రభుత్వానికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

కత్తి కంటే కరుణ గొప్పది

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



ప్రార్థన చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ మంత్రి ఆలపాటి

కొల్లిపర, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కత్తి కంటే కరుణ... కక్ష కన్నా క్షమాభిక్ష గొప్పవని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం కొల్లిపర నూతన యోరూష లేము ప్రార్థన మందిరం సమీపంలో పాస్టర్ ఈమని మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. అమెరికాలో తన దగ్గర ఉద్యోగంలో ఉన్న 500 మందిలో 400 మంది క్రిస్టియన్స్ అని తెలిపారు. అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ క్రీస్తు మార్గం అనుసరణీయమన్నారు. ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచు కోవాలన్నారు. అనంతరం క్రైస్తవులతో కలిసి పెమ్మసాని చంద్రశేఖర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్ కేక్‌కట్ చేసి అందరికీ సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

కార్యక్రమంలో సర్పంచి పిల్లి రాధిక, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి, నాయకులు ఆళ్ళ వీరారెడ్డి, గుదిబండి గోవర్ధన రెడ్డి, భీమవరపు లంక కోటిరెడ్డి, బొల్లు యోగానందచటర్జీ, ఉయ్యూరు శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



హాస్టల్‌లోని బాలికలకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న వెంకటేశ్వరావు, శివరామకష్ణ, రాహల్ తదితరులు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెంచుపేటలోని బీసీ బాలికల వసతి గృహంలో ఆదివారం తెనాలి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం సభ్యులు వసతి గృహంలోని విద్యార్థులకు దుప్పట్లు, పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ బీసీ సంక్షేమ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరావు పాల్గొని విద్యార్థులకు దుప్పట్లు, పుస్తకాలు, ఇతర నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభివృద్ధికి బీసీ సంక్షేమ సంఘం కృషి చేస్తుందని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు శివరామకృష్ణ, జొన్నాదుల రాహుల్, పవన్ కుమార్, ప్రతాప్‌రెడ్డి, చెన్నకేశవులు, సురేంద్రమోహన్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ వి.బిక్షాలు, గడ్డం సరోజని, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కోలాటం ప్రదర్శిస్తున్న బాలికలు

108 మంది బాలికలతో గోవిందనామ కోలాటం

తెనాలి అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం 108 బాలికలు గోవిందనామ కోలాట ప్రదర్శన చేశారు. సాయిరామ్ సంగీతలహరి కోలాట భజన మండలి ఆధ్వర్యంలో 40రోజులుగా బాలికలు శిక్షణ పొందారు. శిక్షకురాలు వి.లక్ష్మీసునీత పర్యవేక్షణలో హనుమాన్ చౌక్ నుంచి ఆలయం వరకు ప్రధాన రహదారిపై కోలాటాన్ని ప్రదర్శిస్తూ ఊరేగింపు చేశారు. కోలాటంలో పాల్గొన్న బాలికలందరిని ఈ నెల 26న తిరుమల తీసుకువెళ్లి 27న ఆస్థాన మండపంలో గోవిందనామ సంకీర్తన ఆలయం ఎదుట కోలాట ప్రదర్శన నిర్వహించనున్నట్లు లక్ష్మీసునీత తెలిపారు. కొండపి శ్రీనివాసరావు, సునీల్‌కుమార్, ప్రసాద్, సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని జయించేందుకు సంగీతం దోహదం

● ఐఏఎస్ అధికారి కాంతిలాల్ దండే



ఐఏఎస్ అధికారి కాంతిలాల్ దండేను సత్కరిస్తున్న నిర్వాహకులు

తెనాలి అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నేటి ఉరుకుల పరుగుల జీవనంలో మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు సంగీతం ఎంతగానో ఉపయోగపడుతుందని ఐఏఎస్ అధికారి, ఆర్‌అండ్‌బీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే చెప్పారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి అన్నమయ్య గీతాంజలి కార్యక్రమం నిర్వహించారు. సంకీర్తన కల్చరల్ అసోసియేషన్ వార్షికోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెనాలి ప్రాంతంతో తనకు అవినాభవ సంబంధం ఉందని, ఇక్కడ సబ్ కలెక్టర్‌గా పనిచేసిన కాలంలో విధి నిర్వహణలో సాంస్కృతిక సాహిత్య రంగాల నుంచి మంచి అనుభూతి కలిగిందన్నారు. పిల్లల వైద్యనిపుణులు పురుషోత్తమరావు ఆధ్వర్యంలో పలువురు కళాకారులు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. గణపతి ప్రార్థనతో మొదలైన కీర్తనలు పలు రాగాలలో ఆదితాళంతో వినిపించిన కీర్తనలు శ్రోతలను అలరించాయి. కేవీ రామకృష్ణ, గోపాలకృష్ణమూర్తి, కుమార్ బాబు, ఆంజనేయశాస్త్రి, నాగప్రసాద్, కిషోర్, జగన్మోహిని, వాయిద్యా సహకారం అందించారు.



సత్కారం అందుకుంటున్న బాలత్రిపురసుందరి శిష్యబృందం

హైదరాబాద్‌లో తెనాలి కళాకారుల నృత్య నీరాజనం

తెనాలి అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ దేవులపల్లి రామానుజరావు కళామందిర్‌లో తెనాలి కూచిపూడి కళాకారులు శాస్త్రీయ నృత్య నీరాజనంలో పాల్గొన్నారు. ఆదర్శకళా నిలయం ఆధ్వర్యంలో ఆదివారం నాలుగు గంటల పాటు నిర్వహించిన కూచిపూడి నృత్య కార్యక్రమంలో కల్యాణి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు డాక్టర్ చల్లా బాలాత్రిపురసుందరి శిష్యులు 16మంది నృత్యం ప్రదర్శించారు. దైవజ్ఞశర్మ విద్యార్థులకు, బాలత్రిపురసుందరికి బహుమతులు అందజేశారు. శివతాండవం, అన్నమాచార్య కీర్తనలు ప్రదర్శించి అభినందనలు అందుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి... భార్యకు తీవ్రగాయాలు

కొల్లిపర, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కారు.. బైక్‌ను ఢీకొనడంతో భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని పిడపర్రులాకు సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బాపట్ల జిల్లా కొల్లూరు గ్రామానికి చెందిన మట్టా అంజనేయులు (60) భార్యతో కలిసి బైక్‌పై విజయవాడ నుంచి కొల్లూరు వెళతుండగా, కొల్లిపర మండలం హనుమాన్‌పాలెం నుంచి మున్నంగికి వెళతున్న ఏపీ 31టీవీ 7722 అనే కారు పిడపర్రులాకు సమీపంలో ఢీకొట్టింది. దీంతో అక్కడకక్కడే అంజనేయులు మృతి చెందగా అతని భార్యకు బలమైన గాయాలు అవ్వటంతో స్థానికులు 108కు సమాచారం అందించటంతో ఆమెను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కోటేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీనిపై కేసునమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దశావతార వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న కృష్ణబాబు



మెడికల్ అండ్ హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ ధర్మకర్త

పెదకాకాని, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వెంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రాన్ని మెడికల్ అండ్ హెల్త్ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు ఆదివారం దర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రదక్షణలు నిర్వహించి, స్వామివారికి, మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణభాస్కరరావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గణితంలో పట్టు సాధిస్తే ఉత్తమ ఫలితాలు

● రాఘవేంద్ర హాస్పిటల్ ఎండీ డాక్టర్ రాఘవేంద్ర

పొన్నూరు టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గణిత సబ్జెక్టులో పట్టు సాధిస్తే ఉన్నత విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని రాఘవేంద్ర హాస్పిటల్ ఎండీ డాక్టర్ రాఘవేంద్ర అన్నారు. స్థానిక శ్రీవేద హైస్కూల్‌లో ఆదివారం శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు జరిగాయి. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన గణిత మోడల్‌ను ఆహూతులు తిలకించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంగా కష్టపడి చదివితే విద్యలో రాణించవచ్చన్నారు. గణితంపై పట్టు సాధిస్తే మిగిలిన అన్ని పాఠ్యాంశాలను సులువుగా అవగతం చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రవి రాకేష్, నన్నపనేని బాలకృష్ణ, పాఠశాల డైరెక్టర్ అంబటి వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తాం

● రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు రామసత్యనారాయణ

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆర్యవైశ్యుల సంక్షేమానికి, అభ్యున్నతికి కృషి చేస్తామని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ అన్నారు. స్థానిక మారీసుపేటలోని పెండేల వెంకట్రావు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం గుంటూరు జిల్లా ఆర్యవైశ్య సంఘాధ్యక్షుడు పెండేల సుబ్బారావు అధ్యక్షతన మండల, పట్టణ సంఘాల ప్రథమ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు రామసత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘాలలో ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పెండేల వెంకట్రావు, వలివేటి కృష్ణ, చుండూరు ఉమామహేశ్వరావు, బావనపల్లి ప్రభాకరరావు, మాజేటి గోపాలకృష్ణ, మద్ది రామకోటేశ్వరావు, టీడీపీ కౌన్సిలర్ దేసు యుగంధర్, సుగ్గుల వెంకటప్పయ్య, వరదా వెంకట శేషగిరిరావు, వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

శ్రీనివాస రామానుజన్‌కు ఘన నివాళి

చేబ్రోలు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గణితం పాఠ్యాంశంపై మక్కువ పెంచుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం ఏడుకొండలు అన్నారు. నారాకోడూరు పాఠశాలలో ఆదివారం జాతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు రామానుజన్ జీవిత విశేషాలను తెలియజేసారు. గణితంలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. గణిత ఉపాధ్యాయుడు కోలా ప్రసాదును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏ శ్రీనివాసరావు, జే విశ్వేశ్వరరావు, వై రాజారెడ్డి, కె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస రామానుజన్ కు నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

వైసీపీ పెద్దల ప్రోత్సాహంతో వేధింపులు

● పోలీసుల వద్ద వాపోయిన మాజీ ఎమ్మెల్యే కిలారి

పొన్నూరు టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పెద్దల ప్రోత్సాహంతోనే తనపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పోలీసు పెద్దల వద్ద వాపోయినట్లు సమాచారం. ఇటీవల రెండు పర్యాయాలు పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పోలీసులు ఎదుట విచారణకు హాజరయ్యారు. విచారణ సందర్భంగా రోశయ్య సోషల్ మీడియాలో పోస్టులతో తనకు సంబంధం లేదని విచారణలో వెల్లడించారు. అంతేకాకుండా ధూళిపాళ్ళ కుటుంబ సభ్యులపై తన పార్టీ నాయకులు, కార్యకర్తలు అభ్యంతరకరంగా మాట్లాడిన సమయంలో వారించానని, పోలీసులే తనను ఈ కేసులో అనవసరంగా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించినట్లు సమాచారం. అయితే విచారణ చేసిన పోలీసు అధికారులు మిమ్మలను అనవసరంగా ఎందుకు విచారిస్తామని, రోశయ్య ప్రోద్బలంతోనే గోపిలాల్ సోషల్ మీడియా పోస్టులు పెట్టినట్లు అంగీకరించడంతో రోశయ్య మిన్నకున్నారని సమాచారం. వైసీపీలో ఉన్న పెదకాకాని మండలానికి చెందిన వైసీపీ పెద్దలు ఆళ్ల రామకృష్ణారెడ్డి తదితరులు తనపై పెట్టిన కేసుల వెనక ఉన్నట్లు పోలీసు అధికారుల ముందు వాపోయినట్లు సమాచారం. అంతేకాకుండా ఇటీవల పొన్నూరు పట్టణానికి చెందిన షేక్ వాహిదుల్లా అనే వ్యక్తి కిలారి వెంకట రోశయ్య తన ఇంటిని కబ్జా చేశారని ఎస్పీ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడమే కాకుండా ఐజీని కలిసి ఫిర్యాదు చేశారు. వరుస కేసులతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న కిలారి రోశయ్య దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ మాజీ ప్రజా ప్రతినిధి ఇటీవల పోలీస్ ఉన్నతాధికారులను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నట్లు సమాచారం. తాను పార్టీ మారడం వల్ల తనపై వేధింపులకు పాల్పడుతున్నారని పోలీసుల ఉన్నతాధికారులు వద్ద వాపోయారని పొన్నూరులో ప్రచారం జరుగుతోంది. తనపై మరిన్ని కేసులు పెట్టించేలా వైసీపీ పెద్దలే ప్రోత్సహిస్తున్నారని కిలారి రోశయ్య అనుచరులు ఆరోపిస్తున్నారు.



యడ్ల లింగయ్య కాలనీలో పేరుకుపోయిన చెత్త

చెత్తను తొలగించరూ...

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీరావుపేటలోని యడ్లలింగయ్య కాలనీలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడింది. ఆ కాలనీలో సేకరించిన చెత్తను అక్కడే రోడ్డు పక్కన పడవేయడంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రతతో దుర్గంధం వెదజల్లుతోంది. ఆ రోడ్డులో వెళుతున్న ప్రజలు, వాహనదారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చెత్తను తరలించి, డస్ట్ బిన్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

దాడిపై కేసు నమోదు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యువకులపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ఆదివారం స్థానిక చెంచుపేట డొంకరోడ్డుకు చెందిన జనసేన కార్యకర్తలు మునిపల్లి వంశీ, మునిపల్లి దుర్గారావులు ఆదివారం తమ నివాస ప్రాంతం నుంచి ప్రధాన రోడ్డుకు నడుచుకుంటూ వస్తున్నారు. దారిలో వైసీపీకి చెందిన ఏడుగురు యువకులు కార్తీక్, బెన్ని, పాల్, ప్రసాద్, అఖిల్, మోషే, దిలీప్‌లు వారిని అడ్డగించి దాడికి పాల్పడ్డారు. శనివారం వైసీపీకి చెందిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఫ్లెక్సీలను తొలగించారంటూ, డీజే ఏర్పాటుచేస్తే సౌండ్ తగ్గించమంటారా అంటూ దాడి చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అబాకస్ పోటీలలో గెలుపొందిన విద్యార్థి భాస్కర్‌కు బహుమతి అందచేస్తున్న అతిథులు

అబాకస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

పొన్నూరు టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అబాకస్ పోటీలలో చిన్నారి భాస్కరశ్రీ వెంకటేశ్వర్లు అసాధారణ ప్రతిభ అభినందనీయమని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ బాపట్ల జిల్లా అధికారి వై.వెంకటేశ్వరరావు అన్నారు. పొన్నూరు యుసిమాస్ పాఠశాలలో అబాకస్ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం ఆదివారం జరిగింది. అంతర్జాతీయ స్థాయిలో అబాకస్ మెంటల్ క్యాలిక్యులేషన్ రెండో కేటగిరీలో మూడవ రన్నరుగా పొన్నూరుకు చెందిన భాస్కర్ శ్రీవెంకటేశ్వర్లు గెలుపొందటం అభినందనీయమన్నారు. అలాగే రాష్ట్రస్థాయిలో బి డాలర్ నక్షత్ర, కె అవిఘ్నేష్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఈ విద్యార్థులకు మెమెంటోలు సర్టిఫికెట్లను వెంకటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో హోమియో వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మీకుమారి, సాంబశివరావు, కె మురళీధర్ రావు, కేశవరావు, ఎం నరేంద్ర, శిక్షకురాలు కే అనూష తదితరులు పాల్గొన్నారు.



మాచవరం రహదారి మరమ్మతులు చేస్తున్న కార్మికులు

మాచవరం రహదారి పనులకు మోక్షం

పొన్నూరు టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి ప్రయాణికులకు నరకప్రాయంగా మారిన మాచవరం రహదారికి ఏట్టకేలకు మోక్షం లభించింది. మండల పరిధిలోని మాచవరంలో ప్రధాన రహదారిపై ప్రజలు అనేకసార్లు గత పాలకులకు మొరపెట్టుకున్నప్పటికీ ప్రజల విన్నపాలు బుట్టదాఖలు అయ్యాయి. ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో స్థానికులు రహదారి దుస్థితిని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వంలో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఇటీవల కూటమి ప్రభుత్వం రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఆదివారం రోడ్లు, భవనాల శాఖ అధికారులు రహదారి మరమ్మతు పనులను ప్రారంభించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరికి సన్మానం

తెనాలి అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి చదువు లేకున్నా స్వయంకృషితో ఎదిగి కుటుంబంతో పాటు ఇతరులకు కూడా ఉపాధి చూపడం అభినందనీయమని సీనియర్ వాణిజ్యవేత్త మర్రెడ్డి బసివిరెడ్డి చెప్పారు. పసుపులేటి కోటేశ్వరరావు, తులశమ్మ స్మారక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్వయంకృషితో ఎదిగిన ఇద్దరికి శ్రమయేవ జయతే పేరిట సత్కరించారు. ఇంజనీరింగ్ వర్క్స్ నిర్వహించే షేక్ మొహిద్దీన్, సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మట్టుపల్లి సాంబయ్యను సన్మానించారు. వీరబ్రహ్మేంద్ర చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఈఎల్‌వీ అప్పారావు మాట్లాడుతూ, కన్నబిడ్డలు తల్లిదండ్రులను మరిచిపోతున్న తరుణంలో పెద్దవారిని గుర్తించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు తన్నీరు శివశంకర్, మల్లికార్జునరావు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.